

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 03-01-2026 | సంపుటి - 26 | సంచిక -226 | రూ : 4 | పేజీలు: 8

# మూసీకి మహర్దశ..

## రూపురేఖలు మార్చే బృహత్ ప్రణాళిక ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి

- మూసీ పునరుజ్జీవనానికి ప్రభుత్వ కార్యాచరణ.. మార్చి 31 డెడ్‌లైన్
- ప్రాజెక్టుకు ఏడీబీ రూ.4 వేల కోట్ల రుణం.. గోదావరి జలాల తరలింపు
- గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం
- బాపూఘాట్‌లో ప్రపంచంలోనే ఎత్తైన గాంధీ విగ్రహం ఏర్పాటుకు ప్రణాళిక
- హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం



2లో




2లో

## తల్లిదండ్రులకు వాట్సాప్ లో

# హాల్ టిక్కెట్లు

- ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు
- హాల్ టిక్కెట్లు ముందే వాట్సాప్ చేస్తే తప్పులు సరిదిద్దే అవకాశముంటుందని వెల్లడి
- హాల్ టిక్కెట్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని



2లో

### హైదరాబాద్ శివారులో

## దట్టమైన పొగమంచు..

- స్తంభించిన ట్రాఫిక్
- ముందు వెళ్లే వాహనాలు కనిపించక ఇబ్బందులు పడ్డ డ్రైవర్లు
- శంషాబాద్ హైవేపై 10 కిలోమీటర్ల మేర నిలిచిపోయిన ట్రాఫిక్
- విజయవాడ జాతీయ రహదారిపై లైట్ల వెలుతురులో వాహనాల రాకపోకలు

## అమరావతి నిర్మాణ పనుల్లో

# మరో కీలక అడుగు..

- పంపింగ్ స్టేషన్-2 పనులకు టెండర్ల ఖరారు!
- ఉండవల్లి వద్ద పంపింగ్ స్టేషన్-2 నిర్మాణం
- మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాకు నిర్మాణ పనుల అప్పగింత
- రాజధాని ప్రాంతంలో నీటి ముంపు ఏర్పడకుండా ఉండటమే ప్రాజెక్టు లక్ష్యం



2లో



2లో

### తిరుమలలో భక్తుల కోసం

## టీటీడీ సరికొత్త ఆలోచన

- వైకుంఠ ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు
- మూడు రోజుల్లో 1.77 లక్షల మందికి శ్రీవారి దర్శనం
- తిరుమల హుండీకి రికార్డు స్థాయిలో ఆదాయం
- భక్తుల కోసం వీపున వాటర్ క్యాన్లతో టీటీడీ సేవలు
- ప్రాణదాన ట్రస్టుకు చెన్నై భక్తుడి రూ.50 లక్షల విరాళం

## పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీలో

# పాల్గొనాలని సీఎం నిర్ణయం





2లో

- ఏపీలో ప్రారంభమైన కొత్త పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ
- నేతల చిత్రాలు లేకుండా రాజముద్ర, క్యూఆర్ కోడ్‌తో ముద్రణ
- రీసర్వే పూర్తయిన గ్రామాల్లో 22 లక్షల పుస్తకాల పంపిణీ
- జనవరి 9 వరకు కొనసాగనున్న ప్రత్యేక కార్యక్రమం
- ఒకరోజు పంపిణీలో పాల్గొననున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



2లో

### మావోయిస్టులకు

## మరో ఎదురు దెబ్బ..

### తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయిన కీలక నేత

- డీజీపీ ఎదుట లొంగిపోయిన మావో నేత బర్సే దేవా
- హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత మావోలకు భారీ ఎదురుదెబ్బ
- హిడ్మా, బర్సేలది ఒకే గ్రామం

# మూసీకి మహర్దశ.. రూపురేఖలు మార్చే బృహత్ ప్రణాళిక ప్రకటించిన సీఎం

హైదరాబాద్: హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో అత్యంత కీలకమైన మూసీ నది పునరుజ్జీవనంపై తెలంగాణ ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. మార్చి 31వ తేదీలోగా ప్రాజెక్టు అంచనాలు పూర్తి చేసి, టెండర్లు పిలవడం ద్వారా అభివృద్ధి పనులను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా వెల్లడించారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఈ అంశంపై జోక్యం చేసుకున్న సీఎం, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన ప్రభుత్వ విస్తృత లక్ష్యాలను, ప్రణాళికలను సభ్యులకు వివరించారు. ఈ బృహత్ ప్రాజెక్టు కోసం ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) రూ.4 వేల కోట్ల రుణం ఇచ్చేందుకు సూత్రప్రాయంగా అంగీకరించిందని, కేంద్రం నుంచి కూడా అవసరమైన అనుమతులు లభించాయని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రాజెక్టులో భాగంగా గోదావరి నుంచి 20 టీఎంసీల నీటిని తరలించి, అందులో 15 టీఎంసీలను నగర తాగునీటి అవసరాలకు, మిగిలిన 5 టీఎంసీలతో మూసీలో నిరంతరం శుద్ధమైన నీరు ప్రవహించేలా చూస్తామని స్పష్టం చేశారు. ప్రాజెక్టులో భాగంగా గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల పొడవున ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నట్లు సీఎం చెప్పారు. దీంతో పాటు, బాపూ ఘాట్ వద్ద మూసా-ఈసా నదుల సంగమ ప్రదేశంలో 'V' ఆకారంలో 'గాంధీ సరోవర్' అభివృద్ధి చేస్తామన్నారు. ఇక్కడే ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ ఆలోచనగా వెల్లడించారు. మూసీ నది కాలుష్యం వల్ల పరివాహక ప్రాంతాల్లో పర్యావరణం, ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటున్నాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల వ్యర్థాలు, చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ ప్రాజెక్టును చేపడుతున్నామని స్పష్టం చేశారు. ఒకప్పుడు నిజాం హయాంలో మూసీ తీరంలో గొప్ప అభివృద్ధి జరిగిందని, 1908 వరదల తర్వాత ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ఇప్పుడు మూసీకి పూర్వవైభవం తీసుకువస్తామని అన్నారు. ప్రాజెక్టులో భాగంగా మంచిరేవుల వద్ద పురాతన శివాలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, మూసీ తీరంలో గురుద్వారా, మసీదు, చర్చి వంటివి నిర్మించి మతసామరస్యాన్ని చాటుతామని చెప్పారు. ప్రస్తుతం కన్సల్టెన్సీల ద్వారా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేస్తున్నామని, అది పూర్తయిన వెంటనే శాసనసభలో సభ్యుల ముందు ఉంచి, వారి సలహాలు తీసుకుని ముందుకు వెళ్తామని సీఎం హామీ ఇచ్చారు. మూసీ పరివాహక ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన నివాసాలు కల్పిస్తామని, హైదరాబాద్‌ను పర్యావరణ హిత నగరంగా, ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## తల్లిదండ్రులకు వాట్సాప్ లో హాల్ టిక్కెట్లు

తెలంగాణ : తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ఇంటర్ విద్యార్థులకు సంబంధించి ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల హాల్ టిక్కెట్లను వారి తల్లిదండ్రులకు వాట్సాప్ ద్వారా పంపనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. హాల్ టిక్కెట్లను వాట్సాప్ చేయడం ద్వారా వాటిలో ఏవైనా పొరపాట్లు ఉంటే పరీక్షలకు ముందే గుర్తించే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, పరీక్షలకు 2 నెలల ముందే తల్లిదండ్రులకు హాల్ టిక్కెట్లను వాట్సాప్ చేయనున్నట్లు వెల్లడించారు. చాలా మంది తల్లిదండ్రుల వద్ద స్మార్ట్ ఫోన్లు ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు హాల్ టిక్కెట్‌లో ముద్రించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఏమైనా తప్పులుంటే సంబంధిత కళాశాల ప్రిన్సిపల్‌కు తెలియజేయాలని ఇంటర్ బోర్డు సూచించింది. అలాగే హాల్ టిక్కెట్ నెంబర్, పరీక్ష కేంద్రం చిరునామా, ఏ రోజు ఏ పరీక్ష జరుగుతుందో తల్లిదండ్రులకు తెలియజెప్పడమే ప్రధాన ఉద్దేశమని పేర్కొంది.

## హైదరాబాద్ శివారులో దట్టమైన పొగమంచు..

హైదరాబాద్: హైదరాబాద్ శివారు ప్రాంతాలను శుక్రవారం తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కమ్మేసింది. మంచు తీవ్రత ఎక్కువగా ఉండటంతో రోడ్లు, భవనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా నగర శివార్లలోని ఇబ్రహీంపట్నం, నాగార్జునసాగర్ హైవే, మేడ్చల్, తూంకుంట, శామీర్‌పేట, గండిపేట, మోకిల, పటాన్‌చెరు, వికారాబాద్, రాజేంద్రనగర్, ఆదిబట్ల తదితర ప్రాంతాల్లో జీరో విజిబిలిటీ నమోదైంది. దీంతో ఉదయాన్నే రోడ్లెక్కిన వాహనదారులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొగమంచు కారణంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు మార్గంతో పాటు బెంగళూరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో డ్రైవర్లు తమ వాహనాలను రోడ్డు పక్కనే నిలిపివేశారు. ఫలితంగా శంషాబాద్ నుంచి పాలమాకుల వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. అటు ఔటర్ రింగ్ రోడ్డు (ORR)పై కూడా మంచు ప్రభావం ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. మరోవైపు హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారిపై కూడా పరిస్థితి ఇలాగే ఉంది. అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద పది అడుగుల దూరంలో ఉన్న వాహనాలు కూడా కనిపించనంతగా పొగమంచు కురుస్తోంది. విజిబిలిటీ పూర్తిగా తగ్గిపోవడంతో వాహనదారులు హెడ్ లైట్లు, ఇండికేటర్లు వేసుకుని నెమ్మదిగా వెళ్లాల్సి వచ్చింది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉండటంతో వాహనదారులు ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

## తిరుమలలో భక్తుల కోసం టీటీడీ సరికొత్త ఆలోచన

తిరుమల : తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో వైకుంఠ ద్వార దర్శనాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గోవిందనామ స్మరణతో తిరుమల గిరులు మార్మోగుతున్నాయి. వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగింది. డిసెంబర్ 30 నుంచి జనవరి 1 వరకు కేవలం మూడు రోజుల్లోనే దాదాపు 33 వేల వాహనాలు తిరుమలకు చేరుకోగా, సుమారు 1,77,000 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. హుండీ ఆదాయం కూడా రికార్డు స్థాయిలో నమోదైంది. డిసెంబర్ 30న రూ. 2.25 కోట్లు రాగా, 31న ఏకంగా రూ. 4.79 కోట్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండే భక్తుల దాహార్తిని తీర్చేందుకు టీటీడీ ఓ వినూత్న ఆలోచనను అమలు చేసింది. ఎండలో అలసిపోయే భక్తులకు తక్షణమే నీరు అందించేలా శ్రీవారి సేవకులు వీపుకు వాటర్ క్యాన్లను తగిలించుకుని గ్లాసులతో నీటిని అందిస్తున్నారు. వైకుంఠ ద్వార దర్శనం చేసుకుని బయటకు వచ్చే భక్తులకు ఈ సేవ ఎంతో ఊరటనిస్తోంది. ఈ కొత్త విధానంపై భక్తుల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి. ప్రస్తుతం టోకెన్లు లేని భక్తులను కూడా సర్వదర్శనానికి అనుమతిస్తున్నారు. ఆక్టోపస్ భవనం, నారాయణగిరి ఉద్యానవనం మీదుగా క్యూలైన్లను క్రమబద్ధీకరించి, వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2 ద్వారా భక్తులను లోపలికి పంపిస్తున్నారు. ఇదిలా ఉండగా... చెన్నైకి చెందిన పొన్నయ నాగేశ్వరన్ అనే భక్తుడు టీటీడీ శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.50 లక్షల భారీ విరాళాన్ని ప్రకటించారు. దీనికి సంబంధించిన డీడీని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు ఆయన అందజేశారు.

## మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ..

హైదరాబాద్ : ఇప్పటికే అనేక సమస్యలను ఎదుర్కొంటున్న మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. గత కొన్ని నెలలుగా ఎదుర్కొంటున్న సమస్యలు, ఎన్‌కౌంటర్లు, నేతల ఆరోగ్య సమస్యలు, అంతర్గత గ్రూపు సమస్యలు ఇప్పటికే పార్టీని బలహీనపరిచాయి. ఈ సంక్షోభంలో మరో కీలక మావోయిస్టు నేత బర్సే దేవా ఈ రోజు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో పోలీసుల ఎదుట లొంగిపోయారు. బర్సే దేవా మావోయిస్టు గెరిల్లా లిబరేషన్ ఆర్మీ చీఫ్‌గా పనిచేస్తూ, పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్న నేత. ముఖ్యంగా ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కీలక నేత హిడ్మా మరణించిన తర్వాత, పార్టీకి అవసరమైన ఆయుధాలు, వ్యూహాలు, రక్షణ కార్యకలాపాలన్నింటిని బర్సే దేవా చూసుకుంటున్నారని పోలీసులు తెలిపారు. బర్సే దేవా, హిడ్మా ఒకే గ్రామానికి చెందినవారని, దీంతో మావోయిస్టు పార్టీలో ఆయన పాత్ర మరింత కీలకమని విశ్లేషకులు చెబుతున్నారు. పోలీసులకి లొంగిన తర్వాత, బర్సే దేవా దగ్గర మౌంటెన్ ఎల్‌ఎంజీని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆయన పర్యవేక్షించిన మిలిటరీ ఆపరేషనల్ కమాండ్ సభ్యులు కూడా పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ పరిణామంతో, మావోయిస్టు పార్టీకి కీలకంగా నిలిచిన నాయకత్వ వ్యవస్థలో పెద్ద గ్యాప్ ఏర్పడింది. రేపు బర్సే దేవాను మీడియా ముందు ఉంచి, ఆయన లొంగిపోవడంలో వచ్చే ప్రాముఖ్యత, స్వాధీనం చేసిన ఆయుధాల వివరాలు, మిలిటరీ ఆపరేషనల్ కమాండ్ సభ్యుల గురించి డీజీపీ శివధర్ రెడ్డి అధికారికంగా వివరించనున్నారు. ఈ సంఘటన తెలంగాణలోని మావోయిస్టు ఉద్యమానికి పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. గతంలో, అనేక మంది కీలక నేతలు ఎన్‌కౌంటర్‌లో మరణించడం, ఆరోగ్య సమస్యలు, పార్టీ అంతర్గత విభజనలు వంటి కారణాలతో ఇప్పటికే ఎంతోమంది సరెండర్ అయ్యారు. తాజాగా బర్సే దేవా కూడా పోలీసుల ఎదుట లొంగిపోయిన తరువాత, పార్టీ వ్యూహాలపై తీవ్ర ప్రభావం పడుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. మావోయిస్టు ఉద్యమం ఇప్పటి వరకు చూసుకున్న వ్యూహాలను సరిచూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది.

## అమరావతి నిర్మాణ పనుల్లో మరో కీలక అడుగు..

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో వరద సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రాజధాని ప్రాంతంలో భారీ వర్షాలు కురిసినప్పుడు, నీరు నిల్వలు ఏర్పడకుండా ఉండేందుకు చేపడుతున్న వరద నియంత్రణ చర్యల్లో భాగంగా, ఉండవల్లి గ్రామం వద్ద 'పంపింగ్ స్టేషన్-2' నిర్మాణానికి టెండర్లను ప్రభుత్వం ఖరారు చేసింది. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ ప్రాజెక్టును జోన్-8 పరిధిలో నిర్మించనున్నారు. ఈ పంపింగ్ స్టేషన్ ద్వారా వరదల సమయంలో సుమారు 8,400 క్యూసెక్కుల నీటిని కృష్ణా నదిలోకి పంపించేలా డిజైన్ చేశారు. వర్షాకాలంలో రాజధాని ప్రాంతంలో నీటి ముంపు ఏర్పడకుండా ముందస్తు రక్షణ కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఈ పనులకు సంబంధించిన టెండర్లలో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థ L1 బిడ్‌గా నిలవడంతో, ఆ సంస్థకే ప్రాజెక్టు బాధ్యతలను అప్పగిస్తూ ADCL నిర్ణయం తీసుకుంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా అధికారికంగా ఆమోదం తెలిపింది. మొత్తం రూ.443.76 కోట్ల అంచనా వ్యయంతో ఈ పంపింగ్ స్టేషన్ నిర్మాణం చేపట్టనున్నారు. ప్రాజెక్టులో భాగంగా కేవలం నిర్మాణమే కాకుండా, సర్వే, డిజైన్, అలాగే నిర్మాణం పూర్తయిన తర్వాత 15 ఏళ్ల పాటు నిర్వహణ, ఆపరేషన్ బాధ్యతలు కూడా MEIL సంస్థే చూసుకోనుంది. దీని వల్ల దీర్ఘకాలికంగా వరద నియంత్రణ వ్యవస్థ సక్రమంగా పనిచేసే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీతో పాటు ప్రపంచ బ్యాంక్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ సహకారంతో సమీకరించనున్నారు. రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా ఈ నిధులను వినియోగించనున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో, పనులు ఆలస్యం కాకుండా వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ అధికారిక ఉత్తర్వులు విడుదల చేశారు. అమరావతిలో వరద నియంత్రణకు ఇది అత్యంత కీలకమైన ప్రాజెక్టుగా అధికారులు భావిస్తున్నారు. పంపింగ్ స్టేషన్-2 పూర్తయితే, వర్షాకాలంలో రాజధాని ప్రాంతంలో నీటి ముంపు సమస్యలు గణనీయంగా తగ్గుతాయని, కృష్ణా నదిలోకి వరద నీటిని సురక్షితంగా మళ్లించేందుకు బలమైన వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు. రాజధాని నిర్మాణంలో ఇప్పటికే కొనసాగుతున్న మౌలిక వసతులకు ఈ ప్రాజెక్టు మరింత బలాన్ని చేకూర్చనుంది.

## ఏపీ నెంబర్ వన్ అంటూ 'ఫోర్బ్స్' కథనం...

### మంత్రి నారా లోకేశ్ స్పందన



అమరావతి : ప్రతిష్ఠాత్మక బిజినెస్ మ్యాగజైన్ 'ఫోర్బ్స్ ఇండియా' ప్రచురించిన ఓ కథనంపై ఏపీ ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఆంధ్రప్రదేశ్ కేవలం పోటీ పడటం లేదని, అందరినీ అధిగమించి ముందుకు దూసుకెళుతోందని ఆయన పేర్కొన్నారు. భారతదేశంలో పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచిందని 'ఫోర్బ్స్ ఇండియా' తన నివేదికలో వెల్లడించింది. ఈ మేరకు బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదికను ఉటంకిస్తూ ఓ కథనం వెలువరించింది.

**ఆ కథనం ప్రకారం...**

పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే సరికొత్త చరిత్ర సృష్టించింది. 2026 ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో దేశవ్యాప్తంగా వచ్చిన ప్రతిపాదిత పెట్టుబడులలో ఏకంగా 25.3% వాటాను కైవసం చేసుకుని అగ్రగామిగా నిలిచింది. ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా విడుదల చేసిన తాజా నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసింది. పెట్టుబడుల స్వీకరణలో ఒడిశా (13.1%), మహారాష్ట్ర (12.8%) వంటి పారిశ్రామిక రాష్ట్రాలను వెనక్కి నెట్టి ఏపీ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. భారతదేశ పారిశ్రామిక, పెట్టుబడుల గమనంలో కీలక మార్పు చోటుచేసుకుంటోందని, వృద్ధి ఇప్పుడు తూర్పు, దక్షిణ రాష్ట్రాల వైపు మళ్లుతోందని ఈ నివేదిక సూచిస్తోంది. నివేదిక ప్రకారం, ఈ ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో దేశవ్యాప్తంగా మొత్తం రూ.26.6 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు ప్రతిపాదనకు వచ్చాయి. ఇది గతేడాది ఇదే సమయంతో పోలిస్తే 11.5% అధికం. ఇందులో సింహభాగం, అంటే 51.2% పెట్టుబడులు కేవలం ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్రలోనే కేంద్రీకృతమయ్యాయి. ఈ మూడింటిలోనూ ఏపీ తిరుగులేని ఆధిపత్యంతో మొదటి స్థానంలో నిలవడం విశేషం.

**లోకేశ్ ఏమన్నారంటే...!**

ఈ అద్భుతమైన విజయంపై రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. "ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు ఇతరులను అందుకోవడం లేదు, వారిని దాటి ముందుకు దూసుకుపోతోంది. స్థిరమైన సంస్కరణలు, నిర్ణయాలు తీసుకోవడంలో వేగం, పెట్టుబడిదారులకు స్పష్టమైన భరోసా ఇవ్వడం వల్లే ఈ అసాధారణ ఫలితం సాధ్యమైంది. పారదర్శకమైన విధానాలతో కూడిన వాతావరణాన్ని సృష్టించడం, పరిశ్రమలకు పెద్దపీట వేయడం, చెప్పిన హామీలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంపైనే మా ప్రభుత్వం దృష్టి సారించింది" అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పెట్టుబడిదారుల స్నేహపూర్వక పాలన, అనుమతులలో వేగం, రంగాల వారీగా ప్రత్యేక విధానాలు, మౌలిక సదుపాయాలపై భారీగా దృష్టి పెట్టడమే ఈ విజయానికి కారణమని ప్రభుత్వం విశ్లేషిస్తోంది. ముఖ్యంగా ఓడరేవులు, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్స్, ఇంధన, డిజిటల్ రంగాలలో మౌలిక వసతులను బలోపేతం చేయడం కలిసొచ్చింది. దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులతో ప్రభుత్వం నిరంతరం జరుపుతున్న చర్చలు, స్థిరమైన విధానాలు, వేగవంతమైన పాలన కారణంగా తయారీ, పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, మౌలిక సదుపాయాల రంగాలలో భారీ పెట్టుబడులు తరలివస్తున్నాయి. "వచ్చే ప్రతి పెట్టుబడి క్షేత్రస్థాయిలో ఫ్యాక్టరీలు, ఉద్యోగాలు, మన ప్రజలకు ఆర్థిక అవకాశాలుగా మారాలి. పెట్టుబడిదారులతో దీర్ఘకాలిక భాగస్వామ్యాలను నిర్మించడం, ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడం కొనసాగిస్తాం" అని నారా లోకేశ్ పునరుద్ఘాటించారు. ఈ ప్రదర్శనతో, భారతదేశ తదుపరి పారిశ్రామిక వృద్ధికి ఆంధ్రప్రదేశ్ ఒక కీలక చోదకశక్తిగా, పోటీతత్వ పాలనకు ఒక ప్రమాణికంగా తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది.

## పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీలో పాల్గొనాలని సీఎం నిర్ణయం

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం నూతన సంవత్సరం వేళ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది. నేతల ఫొటోలు లేకుండా కేవలం ప్రభుత్వ అధికారిక చిహ్నమైన రాజముద్రతో, క్యూఆర్ కోడ్‌తో ఈ కొత్త పాసుపుస్తకాలను ముద్రించారు. భూ రికార్డుల రీసర్వే పూర్తయిన గ్రామాల్లోని సుమారు 22 లక్షల మంది రైతులకు వీటిని అందజేయనున్నారు. ఈ పంపిణీ కార్యక్రమం జనవరి 9వ తేదీ వరకు కొనసాగుతుంది. రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ఈ కార్యక్రమంలో పాల్గొని రైతులకు కొత్త పాసుపుస్తకాలను అందజేశారు. పంపిణీ ప్రక్రియపై ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒకరోజు తాను కూడా స్వయంగా పాల్గొని రైతులకు పాసుపుస్తకాలు అందించాలని ఆయన నిర్ణయించుకున్నారు. గ్రామ సభల ద్వారా పారదర్శకంగా ఈ పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈకేవైసీ ద్వారా లబ్ధిదారుల వివరాలను ధ్రువీకరించుకున్న తర్వాతే పాసుపుస్తకాలను అందిస్తున్నారు. ఈ సమీక్షా సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కూడా పాల్గొన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పంపిణీని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ ఎస్సై

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఓ సబ్‌ఇన్‌స్పెక్టర్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. సంగారెడ్డి జిల్లా కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న ఎం. రమేశ్, ఓ కేసు నుంచి పేరు తొలగించేందుకు లంచం డిమాండ్ చేసి, శుక్రవారం అరెస్టయ్యాడు. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం, కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఒక కేసు నుంచి తన పేరును తొలగించాలని ఓ వ్యక్తి ఎస్సై రమేశ్‌ను ఆశ్రయించాడు. ఇందుకుగానూ ఎస్సై రూ. 30,000 లంచం డిమాండ్ చేశాడు. ఒప్పందంలో భాగంగా, 2025 డిసెంబర్ 17న బాధితుడి నుంచి తొలి విడతగా రూ. 5,000 తీసుకున్నాడు. మిగిలిన రూ. 20,000 ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను సంప్రదించాడు. ఫిర్యాదు స్వీకరించిన ఏసీబీ అధికారులు, పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. శుక్రవారం కొల్లూరు పోలీస్ స్టేషన్‌లోని తన ఛాంబర్‌లోనే బాధితుడి నుంచి ఎస్సై రమేశ్ రూ. 20,000 లంచం తీసుకుంటుండగా, అధికారులు వల పన్ని పట్టుకున్నారు. లంచం సొమ్మును అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన ఎస్సై రమేశ్‌ను హైదరాబాద్‌లోని ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ శాఖల్లో అవినీతిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఏసీబీ ఈ సందర్భంగా పునరుద్ఘాటించింది. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా లంచం డిమాండ్ చేస్తే, తమ టోల్ ఫ్రీ నంబర్ 1064కు గానీ, వాట్సాప్ (9440446106) ద్వారా గానీ సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.

## సైకిల్‌పై శబరిమల యాత్ర

* మణుగూరు నుంచి అయ్యప్ప సన్నిధికి 1400 కిలోమీటర్ల దీక్ష ప్రయాణం



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సనాతన ధర్మంలో ముందుగా తల్లిదండ్రులు, గురువులు, అతిథులను గౌరవించిన అనంతరమే భగవంతుని సేవ చేయాలనే సాంప్రదాయాన్ని ప్రతిబింబించేదే అయ్యప్ప దీక్ష, అయ్యప్ప మాల ధారణ.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని శ్రీ కాళీమాత ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా గత 24 సంవత్సరాలుగా అయ్యప్ప మాల ధరించిన స్వాములకు నిత్య అన్నదానం కొనసాగుతోంది.ఇదే ఆధ్యాత్మిక స్ఫూర్తితో మణుగూరుకు చెందిన శ్రీకర్, రూపేష్, శ్రావణ్ అనే యువకులు మణుగూరు నుంచి సైకిల్‌పై శబరిమల యాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా వారు కొత్తగూడెం చేరుకుని మీడియాతో మాట్లాడారు.సుమారు 1400 కిలోమీటర్ల దూరాన్ని సైకిల్‌పై ప్రయాణిస్తూ అయ్యప్ప సన్నిధిని చేరుకుంటామని వారు తెలిపారు. ప్రతి ఒక్కరిపై అయ్యప్ప స్వామి కరుణ కటాక్షాలు ఉండాలని ప్రార్థిస్తున్నామని, సురక్షితంగా యాత్ర పూర్తి చేసి అయ్యప్ప స్వామిని దర్శించుకుని క్షేమంగా తిరిగి రావాలని వేడుకుంటున్నామని పేర్కొన్నారు.

## వజ్రేష్ యాదవ్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షులు , మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వజ్రేష్ యాదవ్ ని శుక్రవారం దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 296 డివిజన్ దుండిగల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జక్కుల గోపాల్ యాదవ్, పండుగ శ్రీశైలం ముదిరాజ్, దొంతి మహేష్ ముదిరాజ్, శివ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## చింతల్ పద్మశాలి సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : నూతన సంవత్సరం సందర్భంగా చింతల్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మా నగర్ ఫేజ్ 2 లోని రింగ్ రోడ్డులో శుక్రవారం ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్ ను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ , పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వల్లకాటి రాజ్ కుమార్ లు ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మనమంతా సంఘ జీవులం. అందరూ ఐకమత్యంతో ఉండి ముందుకు సాగినపుడే అభివృద్ధి సాధ్యమన్నారు. పద్మశాలి సంఘం సామాజిక, సాంస్కృతిక, విద్యా రంగాల్లో ఎంతో చైతన్యవంతమైన సంఘమని, చదువు పట్ల శ్రద్ధ ఉండి చదువుకోలేని పిల్లలకు, అనాధ పిల్లలను చేరదీసి వారిని విద్యలో ప్రోత్సహించినట్లయితే సంఘానికి మంచి పేరు వస్తుందన్నారు. పద్మశాలి సంఘం అభివృద్ధికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం చింతల్ పద్మశాలి సంఘం చీఫ్ ప్రెసిడెంట్ పి. సత్యనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే సత్యనారాయణ తో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పద్మశాలి సంఘం అధ్యక్షులు ఎర్వ శంకరయ్య, చింతల్ పద్మశాలి సంఘం చీఫ్ అడ్వైసర్ పెద్ది మల్లేశం, చీఫ్ ప్రెసిడెంట్ పి. సత్యనారాయణ, అధ్యక్షులు ఎస్.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి సంతోష్, కోశాధికారి గణేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్.శివ కుమార్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తి రెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి, రమణా రెడ్డి, ఆంజనేయులు, జల్దా లక్ష్మీనాథ్, అజయ్ చారి, వెంకటేష్, నాగేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# టెన్త్ విద్యార్థులారా... జాగో!

* వంద రోజులే సమయం – ఇప్పుడే చదువుకు శ్రీకారం
* 3 'పీ' ఫార్ములాతో విజయం ఖాయం





ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఈ విద్యా సంవత్సరం (2025-26)లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్న విద్యార్థులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.ఈ సందర్భంగా భద్రాచలం గిరిజన విద్యా కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డా. ఎం. ప్రభుదయాల్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితంలో తొలి పబ్లిక్ పరీక్షలు కావడంతో వీటికి ప్రత్యేక ప్రాధాన్యం ఉందని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ పరీక్షలు మార్చి 14 నుంచి ప్రారంభమై ఏప్రిల్ 13 (సాధారణ), ఏప్రిల్ 16 (వొకేషనల్)తో ముగియనున్నాయి. మొత్తం ఏడు సబ్జెక్టు పేపర్లు ఉండగా, ప్రతిరోజూ ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభం కానున్నాయి.పరీక్షలకు ఇంకా సుమారు వంద రోజుల సమయం మాత్రమే ఉన్న నేపథ్యంలో విద్యార్థులు సెల్‌ఫోన్లు, టీవీలు, సినిమాల వంటి వాటికి దూరంగా ఉండి చదువుపైనే పూర్తి దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ దశలో సరైన ప్రణాళికతో చదివితే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని చెబుతున్నారు.

### 3 'పీ' ఫార్ములా పాటించాలి

విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించాలంటే ప్లానింగ్, ప్రిపరేషన్, ప్రజెంటేషన్ అనే 3 'పీ' ఫార్ములాను అనుసరించాలన్నారు. సిలబస్‌ను తేదీల వారీగా విభజించుకుని, సబ్జెక్టుల ప్రాధాన్యతను బట్టి సమయాన్ని కేటాయించుకోవాలన్నారు.ప్రణాళిక ప్రకారం రోజువారీ లక్ష్యాలు పెట్టుకుని ఏకాగ్రతతో చదవాలి. ప్రిపరేషన్‌లో రాజీ పడకూడదు. ఎంత చదివామన్నదికన్నా పరీక్షలో సమాధానాలను ఎలా ప్రజెంట్ చేశామన్నదే కీలకమని నిపుణులు సూచిస్తున్నారు.

### ముఖ్య సూచనలు

ప్రశ్నలు నేరుగా ఉండవు... విషయాన్ని అర్థం చేసుకుని అన్వయించాలన్నారు. గత ప్రశ్నపత్రాలు, మాదిరి ప్రశ్నపత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. గణితం, ఇంగ్లిష్, ఫిజిక్స్ వంటి సబ్జెక్టులను మూలాల నుంచి చదవాలన్నారు. ఉదయపు వేళల్లో చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రూప్ స్టడీ ద్వారా విషయాలు మరింత స్పష్టంగా అవగతమవుతాయన్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. చదువుతో సంపాదించిన జ్ఞానం ఎప్పటికీ వృథా కాదని, క్రమశిక్షణ, పట్టుదల, శ్రమతో చదివితే విజయం తప్పదని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.విద్యార్థులు ఈ వంద రోజుల సమయాన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని వారు ఆకాంక్షిస్తున్నారు.



## ముస్తాబాద్‌లో పిచ్చికుక్కల స్వైర విహారం

* గుంపులు గుంపులుగా తిరుగుతున్న వైనం
* ఒంటరిగా వెళ్లాలంటే బెంబేలెత్తుతున్న జనం
* పిచ్చికుక్కలను నియంత్రించండి మహాప్రభో

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్‌లో పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పదుల సంఖ్యలో గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఎవరైనా ఒంటరిగా బయటకు వెళ్లాలంటేనే జనం బెంబేలెత్తిపోతున్నారు. చిన్న పిల్లలతోపాటు పెద్దవారిపై కూడా దాడులు చేస్తున్నాయి. చిన్న పిల్లలు బయట ఆడుకుంటున్న సమయంలో దాడులకు పాల్పడుతున్న క్రమంలో తల్లిదండ్రులు వారి పిల్లలను బయటకు పంపాలంటేనే భయపడుతున్నారు. ఇక రాత్రి సమయాల్లోనైతే ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. ఎవరైనా ఒంటరిగా రాత్రి సమయంలో వెళ్లాలంటేనే అటుగా వీధి సింహాలకు జంకుతున్నారు. వాహనాలపై వెళ్లే వారిని వెంబడిస్తూ మరీ కుక్కలు దాడులు చేస్తున్నాయి. తాజాగా శుక్రవారం ముస్తాబాద్ మండల కేంద్రంలోని 11వ వార్డు మహారాజుల కాలనీలో సిహెచ్.శౌర్య 6 సంవత్సరాల బాలునిపై పిచ్చికుక్కలు దాడికి పాల్పడ్డాయి. దీంతో బాలునికి గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాలున్ని పోతుగల్‌లోని ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సిరిసిల్ల జిల్లా కేంద్రానికి తరలించారు. రోజు రోజుకు కుక్కల దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగి నూతన పంచాయతీ పాలక వర్గం ఏర్పడిన గ్రామాల్లో ఈ సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్ముందు ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకముందే ఇప్పటికైనా పిచ్చి కుక్కల నియంత్రణకు నూతన గ్రామ పంచాయతీ పాలక వర్గం స్పందించి, చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



## ప్రైవేట్ కళాశాల బస్సు బోల్తా

# పలువురు విద్యార్థులకు గాయాలు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని మొండికుంట అటవీ ప్రాంతంలో శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మణుగూరు నుంచి పాల్వంచ వైపు వెళ్తున్న కెఎల్‌ఆర్ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బస్సు అదుపుతప్పి బోల్తా పడింది.ప్రమాద సమయంలో బస్సులో 34 మంది విద్యార్థులు ఉన్నారా..? లేక సుమారు 60 మంది ఉన్నారా..? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలు కాగా, కొందరి పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు సమాచారం. గాయపడిన విద్యార్థులను వెంటనే భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.ప్రమాదానికి గల కారణాలపై ఇంకా స్పష్టత లేదు. శుక్రవారం ఉదయం ప్రాంతంలో దట్టమైన పొగమంచు కురవడం వల్ల ప్రమాదం జరిగిందా..? లేక బస్సు ఫిట్నెస్ లోపం కారణమా..? అనే అంశాలపై పోలీసులు విచారణ చేపట్టారు.ఏదేమైనా బస్సు బోల్తా పడినప్పటికీ పెద్ద ఎత్తున ప్రాణనష్టం జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. ఘటనపై సంబంధిత అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు.

## గులాబీ పువ్వు పట్టు.. సీటు బెల్ట్ పెట్టు

* భద్రాచలంలో సీటు బెల్ట్ అవగాహన కార్యక్రమం నిర్వహణ



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలను పురస్కరించుకుని, భద్రాచలలో రవాణా శాఖ ఆధ్వర్యంలో సీటు బెల్ట్ అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వాహనదారులకు సీటు బెల్ట్ ధరిస్తే వారి భద్రత పెరుగుతుంది, ప్రమాదాల బారిన పడకుండా ఎంతో విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశ్యం. వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరు విధిగా సీటు బెల్ట్, హెల్మెట్ ఉపయోగించాలి అని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకట పుల్లయ్య సూచించారు.కార్యక్రమంలో భాగంగా సీటు బెల్ట్ ధరించి వాహనాలు నడుపుతున్న వారికి గులాబీ పూలను అందించి ప్రోత్సహించారు. రవాణా శాఖ సిబ్బంది, స్థానిక అధికారులు, వాహనదారులు ఈ కార్యక్రమంలో పాల్గొని సీటు బెల్ట్ , హెల్మెట్ ఉపయోగించాలన్న అవగాహన పొందారు.

## గెలుపోటములు సహజం.. ప్రజా సేవే లక్ష్యం

* పంతంగిలో ప్రభుత్వ పథకాలపై ఇంటింటి ప్రచారం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అడుగుజాడల్లో ముందుకు సాగుతూ.. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యమని.. చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయ వెంకట్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కొండె నరసింహ అన్నారు. చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో తూర్పింటి కవిత రవితో కలిసి ప్రభుత్వ పథకాలపై శుక్రవారం భరోసా కల్పిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా తూర్పింటి కవితరవి మీ ముందుకు వచ్చి ఓటమి పాలైన విషయం విధితమేనన్నారు. ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని, ప్రజల మధ్య ఉంటూ ప్రజలకు సేవ చేస్తామన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధికి నిరంతర కృషి చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, నూతన పింఛన్లు, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయించేందుకు ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ ప్రజల పక్షాన నిలబడతామన్నారు. అదేవిధంగా పంతంగి గ్రామ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కడగంచి జనార్ధన్, జాజుల అంజయ్య, తూర్పింటి రవి, బీర్ల యాదయ్య, రత్నం గాలయ్య, మాధగోని ఎల్లయ్య, బొడిగె కృష్ణ, కడగంచి అన్వేష్, బోయ శ్రీకాంత్, బోయ ఆనంద్, బోయ వంశీ, బోయ అరవింద్, బోయ ఓంకార్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

* చిన్న పిల్లలతో ఎవరైనా వెట్టిచాకిరి చేయిస్తే క్రిమినల్ కేసులు నమోదు.
* జిల్లా ఎస్పి రోహిత్ రాజు




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జనవరి 1 నుండి 31వ తారీఖు వరకు వరకు నిర్వహించే ఆపరేషన్ స్మైల్ XII లో భాగంగా పోలీస్ అధికారులు,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ,లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్,చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్,హెల్త్ డిపార్ట్మెంట్ మరియు వివిధ డిపార్ట్మెంట్ అధికారులతో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సమావేశమయ్యారు.ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ఈ సమావేశాన్ని నిర్వహించారు.జిల్లాలోని ఐదు సబ్ డివిజన్లయిన కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, ఇల్లందు,మణుగూరు లో 05 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సమన్వయంతో విధులు నిర్వర్తించి,జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడం కోసం కృషి జరుగుతుందని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు.ఆపరేషన్ స్మైల్ XII కి సంబందించిన వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశ నిర్వహణతో పాటు,వివిధ విభాగాల అధికారులతో కలిసి ఆపరేషన్ స్మైల్ XIఇ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..అన్ని శాఖల సమన్వయంతో పనిచేసి ఆపరేషన్ స్మైల్ XII కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని,18సంవత్సరాల లోపు తప్పిపోయిన,కిరాణం షాపులు, మెకానిక్ షాపులలో,హోటళ్లలో, ఫ్యాక్టరీలలో పనిచేస్తున్న బాల కార్మికులను, వదిలివేయబడిన పిల్లలను,రోడ్డుపై భిక్షాటన చేస్తున్న పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి,వారికి అప్పగించడం లేదా చైల్డ్ కేర్ హోమ్ కు పంపించడం జరుగుతుందన్నారు.చిన్న పిల్లలతో ఎవరైనా బలవంతంగా బిక్షాటన , వెట్టి చాకిరీ చేయించిన వారిపై నూతన చట్టాలను అనుసరించి క్రిమినల్ కేసులు నమోదు నమోదు చేయడం జరుగుతుందని ఎస్పి హెచ్చరించారు.బాలల హక్కుల సంరక్షణ ద్వారానే సంపూర్ణ మానవ అభివృద్ధి సాధ్యమవుతుందని,ఆ దిశగా అధికారులు సమన్వయంతో పక్కా ప్రణాళిక రుపొందించుకోని, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికుల కనిపిస్తే 1098,డయల్ 100కు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.చిన్నపిల్లలు వెట్టిచాకిరికి గురికాకుండా వారి ముఖాల్లో చిరునవ్వులు చిందించేలా ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాన్ని భాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,డీసిఆర్బీ సీఐ శ్రీనివాస్,ఐటి సెల్ ఇన్స్పెక్టర్ రాము, డి డబ్ల్యు వో స్వర్ణలత లెనినా, సి డబ్ల్యూ సి సభ్యులు అంబేద్కర్,సాదిక్ పాషా,అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్స్ షర్ఫుద్దీన్,డీసీపీవో హరి కుమారి,చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సందీప్,అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ ఎగ్జామ్స్ మాధవ రావు, కే ఎస్ సి ఎఫ్ కోఆర్డినేటర్ రాజేష్,కమిటీ మెంబెర్స్ షీ టీం ఎస్సై రమాదేవి,ఎస్సైలు విజయ,రాజేష్,సమ్మిరెడ్డి,రాఘవయ్య,లక్ష్మణ్,జిల్లా పరిధిలో ఏర్పాటు చేయబడిన ఆపరేషన్ స్మైల్ XII ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## శబరియాత్రకు వెళ్లిన అయ్యప్ప స్వాములు...

* అయ్యప్ప నామస్మరణలతో దేవాలయ ప్రాంగణం...



అందోలు, ప్రజాస్ఫూర్తి: అయ్యప్ప మాలను ధరించి 41 రోజుల పాటు చేపట్టి స్వాములు దీక్షను ముగించుకుని శుక్రవారం శబరియాత్రకు బయలుదేరి వెళ్లారు. జోగిపేట పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ ఉన్న శ్రీ అయ్యప్ప దేవాలయంలో గురుస్వాముల నేతృత్వంలో మాజీ కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబుతో పాటు ఇతర స్వాములు ఇరుముడిని దరించారు. దేవాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలను చేపట్టి, పడి పూజను నిర్వహించారు. దేవాలయ ప్రాంగణమంతా అయ్యప్ప నామస్మరణ, పాటలతో మారుమోగింది. స్వాములు శబరియాత్రకు బయలుదేరి వేళ్తుండడంతో పట్టణానికి చెందిన వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు,పెద్దలు అలయానికి తరలివచ్చారు. దేవాలయానికి వచ్చిన భక్తుల కోసం ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల .మాణయ్య, జిల్లా లయన్స్ క్లబ్ ఏరియా కోఆర్డినేటర్ ఆకుల .రాంబాబు, మాజీ ఎఎంసీ చైర్మన్ గంగా జోగినాథ్, మాజీ ఎంపీపీ హెచ్.రామాగౌడ్, అయ్యప్ప దేవాలయ కమిటీ అధ్యక్షుడు రాజశేఖర్ కులకర్ణి, మాజీ కౌన్సిలర్ పులుగు గోపాల్‌రావు, అలయ కమిటీ సభ్యులు అల్లే శ్రీకాంత్, దేవర్‌శెట్టి సంతోష్, అనంత రాజ్, రంగంపెట రాజు, కౌశికే సత్యం, ముద్దుకృష్ణ, అయ్యప్ప మల్లేశం, రమేష్ గౌడ్, వ్యాపారస్తులు కాసాల ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు డీ. శ్రీనివాస్, యాదయ్య, చిన్న, లయన్స్‌క్లబ్ కార్యదర్శి సంతోష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పటేల్ రమేష్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : నూతన సంవత్సరం సందర్భంగా తెలంగాణ టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ని శుక్రవారం వారి కార్యాలయంలో అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, గోపాల్, లింగం, సుధాకర్, సత్తయ్య, రవీందర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాలకు 5 న లడ్డు, పులిహోర, తై బజార్ వేలంపాట



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని జగద్గిరిగుట్ట కొండపై వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ 55 బ్రహ్మోత్సవాలు (జాతర) ఈ నెల 22 నుండి 24 తేదీలలో నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జె.కృష్ణమాచార్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మో త్సవాలలో భాగంగా నిర్వహించు తైబజార్,లడ్డు,పులిహోర ప్రసాదం అమ్మకం,కొబ్బరిచిప్పలు పోగు చేసుకొనుట, దేవాలయానికి ఇరువైపులా లైటింగ్ డెకరేషన్ సిస్టమ్ నిమిత్తము పబ్లిక్ యాక్షన్ వేలంపాట ఈ నెల 5వ తేదీన ఉదయం 11 గంటలకు ఆలయ మంటపంలో జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గలవారు దేవాలయ కార్యాలయంలో (ఈ.వో)తనను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## టెట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి..

* అభ్యర్థులకు పలు సూచనలు చేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో నిర్వహించనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) అభ్యర్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న కీలక పరీక్షలుగా, పకడ్బందీగా, పారదర్శకంగా, ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఈ పరీక్షలు కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించబడతాయి కాబట్టి, అన్ని కేంద్రాల్లో కంప్యూటర్లు, సాంకేతిక సదుపాయాలు, ఇంటర్నెట్ కనెక్టివిటీ, పవర్ బ్యాకప్ మొదలైన ఏర్పాట్లు పూర్తిగా సిద్ధం చేయబడ్డాయి అని, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ప్రతి కేంద్రంలో టెక్నికల్ సిబ్బందిను నియమించామని కలెక్టర్ తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గంటన్నర ముందుగానే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవాలని, పరీక్ష సమయానికి పది నిమిషాలు ముందుగా గేట్లు మూసివేయబడతాయని అనంతరం ఎవరిని అనుమతించబోరని స్పష్టం చేశారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు కార్డు (ఫోటో ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడి మొదలైనవి) తీసుకురావాలి అని నిషితంగా పరిశీలించిన అనంతమే పరీక్షా కేంద్రాల్లోనికి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, కాలిక్యులేటర్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు పూర్తిగా నిషేధించబడ్డాయని, అభ్యర్థులు తమ వెంట తీసుకువచ్చే వ్యక్తిగత సామాగ్రికి తాము పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ పరీక్ష విధానాన్ని ముందుగానే తెలుసుకోవాలి మరియు పరీక్ష ప్రారంభానికి ముందు సిబ్బంది ప్రశ్నాపత్రం విధానం, సమాధానాలు నమోదు చేసే పద్ధతిని వివరించనున్నారు. పరీక్ష సమయంలో అధికారుల సూచనలను పాటిస్తూ ప్రశాంతంగా పరీక్ష రాయాలని కలెక్టర్ కోరారు. పరీక్ష కేంద్రాల్లో ప్రవేశ సమయాలు ఉదయం సెషన్‌కి 7.30 గంటల నుండి 8.50 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్‌కి 12.30 నుండి 1.50 గంటల వరకు ఉంటాయి మరియు ఉదయం సెషన్ అభ్యర్థులను 11.30 గంటలకు, మధ్యాహ్నం సెషన్ అభ్యర్థులను 4.30 గంటలకు మాత్రమే పరీక్ష పూర్తయిన తర్వాత బయటకు పంపుతారు. అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాన్ని ముందుగానే గుర్తించుకోవాలని, పరీక్ష పూర్తయ్యే వరకు ఎవరికీ బయటకు వెళ్ళడానికి అనుమతి ఉండదని జిల్లా కలెక్టర్ తెలిపారు




## కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా పనిచేయాలని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య సూచించారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లక్కారం క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నర్సింహ గౌడ్ అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ ఎన్నికల సన్నాక సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని 20వార్డుల్లో పార్టీ అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగాలని సూచించారు. టిఆర్ఎస్, బిజెపి పార్టీల వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. ఆయా పార్టీల అభ్యర్థులను ఓడించడానికి కంకణ బద్ధులై పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, మునుగోడు ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, మాజీ ఎంపీపీ తాడూరు వెంకట్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, జిల్లా ఫిషరీస్ చైర్మన్ పాశం సంజయ్ బాబు, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ వైస్, చైర్మన్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, తిరుపతి రవీందర్, బొంగు జంగయ్య గౌడ్, మొగుదాల రమేష్ గౌడ్, బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్, కాసర్ల శ్రీనివాసరెడ్డి, కొయ్యడ సైదులు, బాబా షరీఫ్, హన్ను భాయ్, బొబ్బిళ్ళ మురళి, చెన్నగోని అంజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కన్ సాన్ పల్లి రెడ్డి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక...

* అధ్యక్షుడిగా ఎన్.వెంకట్ రామ్ రెడ్డి...
* ప్రధాన కార్యదర్శిగా శేరి ప్రభాకర్ రెడ్డి...



అందోలు, ప్రజాస్ఫూర్తి:అందోలు మండలంలోని కన్ సాన్ పల్లి గ్రామ ఆదర్శ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాజా మాజీ రెడ్డి సంఘం అధ్యక్షుడు సేరి సందీప్ రెడ్డి అధ్యక్షతన రెడ్డి సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షుడిగా నోమన్న గారి వెంకట్ రామ్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఆశిరెడ్డిగారి ప్రదీప్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శేరి ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి కాయితీ అడివిరెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకట్ రామ్ రెడ్డికి ఎన్నిక నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ సంఘం యొక్క అభివృద్ధి కొరకు తను కృషి చేస్తానని పేర్కొన్నారు. సంఘ సభ్యులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సంఘము యొక్క అభివృద్ధితోపాటు పలు సేవా కార్యక్రమం చేపడతానని అన్నారు. సంఘ అభివృద్ధికి సభ్యులతో కలిసి ముందుకు తీసుకువెళ్లి ఆదర్శ సంఘంగా తీర్చిదిద్దడంలో కృషి చేస్తానన్నారు. నాపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకోవడంతో పాటు తన ఎన్నికకు సహకరించిన సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీని సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. సంఘం మాజీ అధ్యక్షులు బగిలి గజేందర్ రెడ్డి, నోమన్న గారి మాధవరెడ్డి, హనుమంతు గారి వెంకట్ రెడ్డి, శేరి నరసింహారెడ్డి, నోమన్న గారి వెంకట్ రెడ్డి, నోమన్నా గారి నరసింహారెడ్డి, నోమన్న గారి హనుమంత్ రెడ్డి, సంఘ సభ్యులు నోమన్న గారి ధీరాజ్ రెడ్డి, ఆశిరెడ్డి గారి విష్ణువర్ధన్ రెడ్డి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## బట్టలిప్పినం.. బట్టబయలు చేసినం: హరీష్ రావు

బనకచర్ల ముప్పును ముందుగా పసిగట్టి పోరాటం మొదలు పెట్టిందే బీఆర్ఎస్ అని మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. ‘మేము ముల్లుకర్ర కాదు బల్లెం పెట్టి పొడిస్తే గాని ఈ ప్రభుత్వం మొద్దు నిద్ర లేవలేదు. ఎన్నో ప్రెస్ మీట్లు పెట్టి, ఎప్పటికప్పుడు హెచ్చరించినా ప్రభుత్వం తగిన స్థాయిలో స్పందించలేదు. బనకచర్ల విషయంలో బీఆర్ఎస్ పోరాటం చేస్తే పాత డేట్లు వేసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లెటర్లు విడుదల చేశారు. మేం పోరాటం చేస్తున్న సమయంలో ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం ఏపీ, తెలంగాణతో మీటింగ్ పెట్టింది. పోను పోను అనుకుంటూనే బనకచర్ల మీటింగ్‌కు రేవంత్ రెడ్డి వెళ్లారు. అపెక్స్ మీటింగ్‌కు కాకుండా వేరే ఏ రకమైన సమావేశానికి హాజరు కావొద్దని మేం ఆనాడు గట్టిగా హెచ్చరించినం. అయినా పోను అనుకుంటూనే వెళ్లారు. పెట్టను పెట్టను అనుకుంటూనే రేవంత్ రెడ్డి సంతకం కూడా పెట్టేశారు. బట్టలిప్పినం. బట్టబయలు చేసినం. మేం నిలదీస్తే, నిలబెట్టి కడిగేస్తే బనకచర్ల మీటింగ్ ఎజెండాలోనే లేదని, కనుక చర్చ జరిగే ప్రసక్తే లేదని డైలాగులు కొట్టారు. మేం ఎజెండా బయట పెట్టి బట్టలిప్పినం. బట్టబయలు చేసినం.. దాంతో పాటు ఏపీ ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా అసలు బండారం బయట పెట్టారు. బనకచర్లపై చర్చ జరిగిందని, బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని సుసాధ్యం చేసేందుకు కమిటీ ఏర్పాటు అయ్యిందని మీడియా ముఖంగా చెప్పారు. బనకచర్ల వలన కృష్ణానది నీటిలో తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకకు నీటి వాటా దక్కకుండా చేసేందుకు నల్లమల సాగర్‌కు చంద్రబాబు తెరలేపారు. 16 జూలై 2025న రేవంత్ రెడ్డి, చంద్రబాబు అంగీకరించిన విధంగా ఏపీ ప్రభుత్వం 15 డిసెంబర్ 2025 న కమిటీ వేస్తే తెలంగాణ ప్రభుత్వం 23 డిసెంబర్ 2025 నాడు వేసింది. ఇరు రాష్ట్రాలు పంపిన పేర్లతో కేంద్ర ప్రభుత్వ అధికారులను చేర్చి నేడు తెలంగాణ, ఏపీల మధ్య నీటి వాటా పంపిణీ కోసం కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ కమిటీ ఖరారు.

# రాష్ట్రంలో టెట్ పరీక్షలు.. అన్ని ఏర్పాట్లు పూర్తి

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీటెట్ 2026) నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శనివారం నుండి 20వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 9 రోజుల పాటు 15 సెషన్లలో ఈ పరీక్షలను నిర్వహించనున్నారు. ఈసారి టెట్ పరీక్షకు మొత్తం 2,37,754 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో పేపర్ 1 పరీక్షకు 85,538 మంది, పేపర్ 2 పరీక్షకు 1,52,216 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 71,670 మంది ఇన్ సర్వీస్ టీచర్లు ఉండగా, 1,66,084 మంది ఇతర అభ్యర్థులు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 18 జిల్లాల్లో మొత్తం 97 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అత్యధికంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 24 కేంద్రాలు (72,295 మంది అభ్యర్థులు), రంగారెడ్డి జిల్లాలో 21 కేంద్రాలు (77,790 మంది అభ్యర్థులు) ఉన్నాయి. పరీక్షలను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలతో



సమన్వయం చేసుకుంటున్నట్లు విద్యాశాఖ డైరెక్టర్ డా. ఇ. నవీన్ నికోలస్ తెలిపారు. పరీక్షకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే అభ్యర్థులు 7093708883 / 7093708884, 7093958881 / 7093468882,7032901383 / 9000756178 హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# కీసర గోల్డ్ షాప్ చోరీ కేసు.. వెలుగులోకి వచ్చిన సీసీటీవీ ఫుటేజ్

కీసర పీఎస్ పరిధిలోని నాగారంలో పట్టపగలు బంగారం షాపులో చోరీ జరిగింది. షాపులోకి ప్రవేశించిన దుండగులు నకిలీ తుపాకీతో బెదిరించి రాడ్డుతో యజమానిపై దాడి చేశారు. అనంతరం బంగారం పట్టుకుని అక్కడ నుండి పారిపోయారు. షాపు యజమానికి తీవ్రగాయాలు కాగా వెంటనే అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నకిలీ తుపాకీని గుర్తించారు. దాడికి సంబంధించిన వివరాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో షాపులోని సీసీ టీవీ పరిశీలించగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. షాపులోకి వచ్చిన ఇద్దరు దుండగులు ముఖానికి మాస్కులు హెల్మెట్ ధరించి ఉన్నారు. ఆ



సమయంలో షాపులో ఇద్దరు కస్టమర్లు ఉండగా యజమాని, అతడి కుమారుడు ఉన్నారు. కుమారుడు చిన్నపిల్లాడు కావడంతో యజమానిపై పదునైన ఆయుధంతో దాడి చేసి ఓ దుండగుడు కిందపడేశాడు. మరో దుండగుడు బంగారం, డబ్బు మొత్తం ఓ బ్యాగులో ప్యాకింగ్ చేసి ఇద్దరూ కలిసి అక్కడ నుండి పారిపోయారు.



## శంషాబాద్‌లో ప్రతికూల వాతావరణం.. 10 విమాన సర్వీసులు రద్దు

హైదరాబాద్: ప్రతికూల వాతావరణం వల్ల శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి వెళ్లాల్సిన 10 విమానాలు రద్దు అయ్యాయి. ముంబయి, బెంగళూరు, విశాఖ, కోయంబత్తూర్, కోల్‌కతా, కోచి, వారణాసి, ఇండోర్, పట్నా, గువాహటికి వెళ్లే విమాన సర్వీసులను రద్దు చేస్తూ డీజీసీఏ నిర్ణయం తీసుకుంది. శుక్రవారం.. తెలంగాణలో భారీగా పొగమంచు కమ్ముకుంది. హైదరాబాద్‌విజయవాడ, హైదరాబాద్ బెంగళూరు హైవేలపై దట్టంగా అలముకోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పొగమంచుతో హైదరాబాద్ బెంగళూరు హైవేపై నాలుగు లారీలు పరస్పరం ఢీకొన్నాయి. దీంతో ట్రాఫిక్ జామ్ అయింది. పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. శంషాబాద్ నుంచి పాలమాకుల వరకు సుమారు 10 కి.మీ మేర ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఔటర్ రింగ్ రోడ్డుపైనా పొగమంచుతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## ఆ కమిటీ.. తెలంగాణ జలద్రోహానికి నిదర్శనం

**: హరీశ్‌రావు**

హైదరాబాద్: ఇవాళ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కమిటీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణకు చేస్తున్న జలద్రోహానికి నిదర్శనమని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు ఆరోపించారు. నదీజలాల పంపిణీ తెలంగాణ కమిటీలో ఇంటర్ స్టేట్ విభాగ అధికారి లేకపోవడం రాష్ట్ర ప్రయోజనాలకు పెను ముప్పు అని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తీరుతో గోదావరి నల్లమల సాగర్‌కు లైన్ క్లియర్



అయిందని, తెలంగాణ నీటి ప్రయోజనాలకు నెంబర్ వన్ విలన్ అని ఘాటుగా విమర్శించారు. "ఇరు రాష్ట్రాలు పంపిన పేర్లతో నీటి వాటాల పంపిణీకి కేంద్ర జలశక్తి శాఖ కమిటీ ఖరారు చేసింది. ఏపీ తరపున ఇద్దరు ఐఏఎస్‌లు, ఇద్దరు ఇంజినీర్లు ఉంటే తెలంగాణ తరపున ముగ్గురు ఐఏఎస్‌లు, ఒక ఇంజనీరింగ్ అధికారి మాత్రమే ఉన్నారు. ఏపీ తరపున ఇంటర్ స్టేట్ అంశాల్లో అనుభవం ఉన్న అధికారి ఉంటే తెలంగాణ తరపున ఆ అనుభవం లేని అధికారి ఉండటం రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలి పెట్టు. ఈ కమిటీ ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలు మూడు నెలల్లో పూర్తి చేయడం అంటే.. 3 నెలల్లో నల్లమల సాగర్‌కు ఆమోదం తెలపడమే. ఇది.. సీఎం రేవంత్ రెడ్డి ఉద్దేశ పూర్వకంగా తెలంగాణకు నష్టం చేసి ఏపీకి మేలు చేసే చర్యే. నల్లమల సాగర్‌కు టెండర్ ప్రక్రియ ప్రారంభమైన వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే తెచ్చి ఉంటే టెండర్ ఖరారయ్యేదే కాదు. ఇవాళ టెండర్ ప్రక్రియ ఖరారై ఐఐసీ టెక్నాలజి ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు పోలవరం నల్లమల సాగర్ డీపీఆర్ తయారీ పనులు అప్పగించారు. ఇది కచ్చితంగా రేవంత్ రెడ్డి కుట్రే" అని హరీశ్ రావు విమర్శించారు.

## ప్రధానికి ఎమ్మెల్యే కూనంనేని క్షమాపణ చెప్పాల్సిందే

**: కేంద్రమంత్రి బండి సంజయ్**

హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. అసెంబ్లీలో ఇలాంటి మాటలకు స్థానం లేదన్నారు. దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టు భావజాలం ప్రజాదరణ కోల్పోయిందని, ఇలాంటి బాధ్యతలేని.. అసభ్యకరమైన భాషే ఇందుకు కారణమని ధ్వజమెత్తారు. "తెలంగాణ అసెంబ్లీలో అలాంటి వ్యాఖ్యలను స్పీకర్ అనుమతించడం బాధాకరం.



ప్రజాస్వామ్య విలువలు కాపాడాల్సిన బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించింది. మిత్రపక్షాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తోంది. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు మాత్రం రాజకీయ దూషణలకే పరిమితమై ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయి. తక్షణమే కూనంనేని తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి. దేశ ప్రజలకు, ప్రధాని మోదీకి క్షమాపణ చెప్పాల్సిందే" అని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## దేశం కోసం ఒక్క బీజేపీ నాయకుడు కూడా త్యాగం చేయలేదు

కేంద్రం ప్రభుత్వం ఉపాధి హామీ చట్టంలో మార్పు తీసుకురావడంతో పేదల పొట్టకొట్టడమేనని, వారి ఆకలి తీర్చే పథకం భవిష్యత్తులో రద్దు చేసేందుకు ఎత్తుగడలువేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. శుక్రవారం అసెంబ్లీలో ఉపాధి హామీ చట్టం మార్పుపై జరిగిన స్వల్పకాలిక చర్చపై ప్రసంగించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేదలకు, మధ్య తరగతి ప్రజలకు ఆర్థికంగా ఎంతో ఆదుకుందని, బీజేపీ ప్రభుత్వం పేదలను, మధ్య తరగతి ప్రజలను కార్పొరేట్ సంస్థలకు ధారదత్తం చేసేలా కొత్త చట్టాన్ని తీసుకువచ్చిందని తీవ్రస్థాయిలో విరుచుకపడ్డారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, తక్షణమే కేంద్రం తీసుకున్న నిర్ణయం వెనక్కి తీసుకోవాలని సూచించారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ ఈ పథకం ఆనాడు యూపీఏ ప్రభుత్వం



తీసుకువచ్చిందన్నారు. మహాత్మాగాంధీ దేశానికి స్వాతంత్రం తీసుకువచ్చారని, వచ్చిన ఆరు నెలల్లో హత్య చేశారన్నారు. ఆయన రక్తం దేశం భూమి పొరల్లో కలిసి పోయిందని, సోనియా గాంధీ దేశ సమగ్రత కోసం కృషి చేశారని పేర్కొన్నారు.

## హైదరాబాద్‌ను 360 డిగ్రీలు కవర్ చేసేలా మెట్రో విస్తరణ : మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్: మున్సిపల్ పరిపాలన వ్యవస్థను పటిష్టం చేసే దిశగా ముందుకు వెళ్తున్నామని తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. అసెంబ్లీలో పురపాలక, జీహెచ్ఎంసీ చట్టసవరణ బిల్లుపై చర్చలో శ్రీధర్ బాబు మాట్లాడారు. జీహెచ్ఎంసీలో పౌరులకు మెరుగైన సేవలను అందించేందుకు ప్రణాళిక రూపొందించామని చెప్పారు. హైదరాబాద్‌ను మళ్లీ ఎన్ని కార్పొరేషన్లుగా విభజిస్తామో ఇంకా నిర్ణయించలేదని చెప్పారు. "ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే గ్రేటర్ విలీనం. మూసీ విషయంలో సీఎం ఎవరి పేర్లు ప్రస్తావించలేదు. పేర్లు ప్రస్తావించనప్పుడు భారత రాష్ట్ర సమితి సభ్యులు ఎందుకు స్పందిస్తున్నారు. మూసీ విషయంలో సభ్యుల సూచనలు స్వీకరిస్తామని సీఎం చెప్పారు. గ్రేటర్‌ను ఎన్ని కార్పొరేషన్లుగా విభజించాలో అందరి అభిప్రాయాలు తీసుకుని ముందుకెళ్తాం. గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించాలని ప్రాథమికంగా అనుకుంటున్నాం. ప్రస్తుతం హైదరాబాద్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 174 పాయింట్లు ఉంది. నగరంలో గాలి నాణ్యత మున్ముందు మరింత పడిపోకూడదని భావిస్తున్నాం. కాలుష్యం మరింత పెరిగిపోకూడదనే.. నగరంలోని పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలకు తరలించే ప్రక్రియ చేపట్టాం. హైదరాబాద్‌ను 360 డిగ్రీలు కవర్ చేసేలా.. మెట్రో విస్తరణ చేపట్టాలని నిర్ణయించాం. అనుమతులు, నిర్వహణలో సమస్యలు రావొద్దనే మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం టేకోవర్ చేస్తోంది. హైదరాబాద్‌లో మున్ముందు మొత్తం ఎలక్ట్రిక్ బస్సులు మాత్రమే తిరిగేలా చూస్తాం" అని మంత్రి వెల్లడించారు.

**గత ప్రభుత్వం అలా చేసింది..**

"జీహెచ్ఎంసీలో వార్డుల సమస్య ఉంటే పరిష్కరిస్తాం. ఇప్పటికే 8 మంది జోనల్ కమిషనర్లను నియమించాం. హైదరాబాద్ పరిపాలన కోసం ప్రత్యేకంగా ఇద్దరు ఐఏఎస్ అధికారులను నియమించాం. గత ప్రభుత్వం సిబ్బందిని నియమించకుండానే జిల్లాలను 33కి



పెంచింది. 33 కలెక్టరేట్‌లను నిర్మించింది కానీ.. వాటిలో సిబ్బంది లేరు. ఈ ప్రభుత్వం రాగానే టీజీపీఎస్సీ ద్వారా కలెక్టరేట్లలో సిబ్బందిని నియమించాం. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడించింది. ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరు ఉంటే.. అది కూడా తొలగించారు" అని శ్రీధర్ బాబు అన్నారు.

## 'రేవంత్‌ను తిడితే ఊరుకోను'.. మంత్రి కోమటిరెడ్డి కీలక వ్యాఖ్యలు

కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. కవిత.. కేసీఆర్ వదిలిన బాణం అని అన్నారు. ఆమె కన్ఫ్యూజన్‌లో ఉండి జనాల్ని కన్ఫ్యూజ్ చేస్తున్నారు.. కవితను కేసీఆర్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే ఊరూరా తిరుగుతున్నారు.. ఆమె బీఆర్ఎస్‌లో ఉందా? ఏ పార్టీలో ఉన్నారో స్పష్టం చేయాలని కోమటిరెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం అసెంబ్లీలో మీడియాతో చిట్ చాట్ చేశారు. తన తండ్రి మీద సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన కవిత.. హరీష్‌రావు మీద చేసిన వ్యాఖ్యలపై ఎందుకు స్పందించలేదు? కేసీఆర్‌కు దగ్గరగా ఉన్న నాయకులు అందర్నీ దూరం చేసేందుకు కవిత విమర్శలు చేస్తున్నట్లు కనిపిస్తుందన్నారు. కేసీఆర్‌ను ఉరితీసినా తప్పు



లేదన్న దానికి రక్తంమరిగిపోయిందన్న కవిత, కేటీఆర్, హరీష్ రావులను ఉరితిసినా తప్పు లేదా కవిత చెప్పాలని అడిగారు.

**రేవంత్‌ను తిడితే ఊరుకోను..**

కేసీఆర్ అసెంబ్లీకి వస్తే బీఆర్ఎస్ పుంజుకుంటుంది అని కవిత అంటున్నారనంటే ఆమె బీఆర్ఎస్‌లోనే ఉన్నట్టుగా అనుమానం ఉందన్నారు. కేసీఆర్‌ను తిడితే వస్తున్న కోపం హరీష్ రావును తిడితే కవితకు ఎందుకు రావడం లేదు? పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ తప్పు అని కవిత ఒప్పుకోవడం సంతోషం.. బీఆర్ఎస్ హయాంలో నల్లగొండ మంత్రి జిల్లాకు చేసిన అన్యాయంపై కవిత ప్రశ్నించాలని ఆయన డిమాండ్ చేశారు. నాకు సీఎం అంటే గౌరవం.. సీఎం రేవంత్‌ను ఎవరు ఏమన్నా అంటే కౌంటర్ ఇస్తా.. నాకు మంత్రి పదవి కావాలని ఎవరినీ అడగలేదన్నారు. నాకు మా తమ్ముని మధ్య ఎటువంటి గొడవలు లేవు.. నేను మంత్రి పదవి కోసం ఏ రోజూ పాకులాడలేదు.. తెలంగాణ కోసం మంత్రి పదవి త్యాగం చేశానని మంత్రి వెంకట్ రెడ్డి తెలిపారు.



## కాల్వలోకి పల్టీ కొట్టిన స్కూల్ బస్సు.. 40 మంది విద్యార్థులకు గాయాలు

పెనుబల్లి: ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం గణేశ్‌పాడు వద్ద స్కూల్ బస్సు అదుపుతప్పి కాల్వలో బోల్తా పడింది. వేంసూరు మండలం మద్దులగూడెంలోని వివేకానందా విద్యాలయం నుంచి సుమారు వంద మంది విద్యార్థులతో గణేశ్‌పాడు, ఎల్ఎస్ బంజరు, కేఎం బంజరు, మార్లకుంట, ముత్తుగూడెం తదితర గ్రామాలకు బయలుదేరింది. గణేశ్‌పాడు గ్రామ శివారులోకి రాగానే.. డ్రైవర్ వేగంగా బస్సు నడపంతో అదుపుతప్పి కాల్వలోకి పల్టీ కొట్టిందని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో దాదాపు 40మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను విద్యార్థుల తల్లిదండ్రులు, వీఎం బంజరు పోలీసులు.. పెనుబల్లి, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరులోని ప్రైవేటు వైద్యశాలలకు తరలించారు.

## మున్సిపాలిటీల విలీనం సరే.. పరిపాలనా సామర్థ్యం సరిచూసుకోవాలి: కూనంనేని

హైదరాబాద్: మున్సిపాలిటీల విలీనంతో హైదరాబాద్.. అతిపెద్ద నగరంగా అభివృద్ధి చెందడం సంతోషంగా ఉందని సీపీఐ ఎమ్మెల్సీ కూనంనేని సాంబశివరావు అన్నారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. వికేంద్రీకరణలో జాగ్రత్త వహించాలని, పరిపాలన సామర్థ్యాన్ని సరిచూసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రపంచ మహానగరంగా మారాలని గొప్పలకు పోతే తిప్పలు తప్పవన్నారు. మౌలిక సమస్యలు ఎలా పరిష్కరించాలన్న దానిపై ఆలోచన చేయాలని చెప్పారు. వర్షాకాలంలో చిన్న వర్షాలకే హైదరాబాద్‌లో ట్రాఫిక్‌జామ్ అవుతుందన్నారు. జిల్లాలు మహానగరంలో విలీనం అవుతున్నాయని, ప్రపంచంలో ఉన్న సౌకర్యాలు కల్పించే అవకాశముందని చెప్పారు. దీనిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. కాలుష్య, డ్రైనేజీ, రోడ్డు వంటి అంశాలపై మేధావులతో చర్చించాలని చెప్పారు.

# సోమనాథ్ ఆలయాన్ని సందర్శించిన అంబానీ కుటుంబం.. రూ.5 కోట్లు విరాళం

అహ్మదాబాద్: రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయాన్ని శుక్రవారం సందర్శించారు. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన ఈ శైవక్షేత్రంలో ఆయన.. తన సతీమణి నీతా అంబానీ, తనయుడు అనంత్ అంబానీతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న అంబానీ కుటుంబ సభ్యులకు ఆలయ ట్రస్ట్ సభ్యులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. దైవదర్శనం అనంతరం సోమనాథుడి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సోమనాథ్ క్షేత్రానికి ముఖేశ్ అంబానీ రూ.5 కోట్లు విరాళం ఇచ్చారు. గతేడాది జనవరిలోనూ ముఖేశ్ అంబానీ, అనంత్ అంబానీ సోమనాథుడిని దర్శించుకున్నారు.







# నేర చరిత్ర ఉన్నవారికీ టికెట్లు..
## సమర్థించుకున్న డిప్యూటీ సీఎం పవార్



పుణె: స్థానిక సంస్థల ఎన్నికల్లో నేర చరిత్ర కలిగిన వారికి టికెట్లు ఇవ్వడాన్ని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ సమర్థించుకున్నారు. రూ.70వేల కోట్ల కుంభకోణానికి పాల్పడినట్లు స్వయంగా తానే ఆరోపణలు ఎదుర్కొన్నానని చెప్పిన ఆయన.. దోషి అని నిరూపితమయ్యే వరకు ఎవ్వరూ నేరస్థులు కాదని ఉద్ఘాటించారు. నేర చరిత్ర ఉన్నవారికీ అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ టికెట్లు ఇస్తోందని కేంద్ర మంత్రి, భాజపా నేత మురళీధర్ మోహోల్ చేసిన విమర్శలకు డిప్యూటీ సీఎం ఈ విధంగా స్పందించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గ్యాంగ్‌స్టర్ సూర్యకాంత్ అలియాస్ బందూ అందేకర్, ఆయన కోడలు సోనాలి అందేకర్‌తోపాటు ఆయన మరదలు లక్ష్మీ అందేకర్‌లకు మిత్రపక్షం (సచిన్ కారత్) నుంచి ఎన్సీపీ టికెట్ ఇప్పించింది. వీరికి నేర చరిత్ర ఉందని, ఇలాంటి వారికి టికెట్లు ఇస్తున్నారని భాజపా ఆరోపించింది. ఈ నేపథ్యంలోనే అజిత్ పవార్ స్పందిస్తూ.. అభ్యర్థుల జాబితాను బహిరంగంగా వెల్లడిస్తానన్నారు. గతంలో తనపైనా ఆరోపణలు వచ్చాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆరోపణలు చేస్తున్న వారితోపాటు తానూ అధికారంలో ఉన్నానని అజిత్ పవార్ వెల్లడించారు.

# డేటా సెంటర్లు, రైల్వేలకు 'అణుశక్తి' ఎంతో మేలు

: అశ్వినీ వైష్ణవ్



కృత్రిమ మేధ ఆధారిత ఆర్థిక వ్యవస్థ, రైల్వేల విద్యుత్ అవసరాలను తీర్చేందుకు చిన్న మాడ్యులర్ అణు రియాక్టర్లు ఆచరణీయ పరిష్కార మార్గాలని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. సస్టెయినబుల్ హార్నెస్సింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (శాంతి) బిల్లుకు ఆమోదం .. సరికొత్త భవిష్యత్ ఆర్థిక వ్యవస్థకు దేశాన్ని సిద్ధం చేసిందన్నారు. దిల్లీలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. మీడియాతో ఈ అంశంపై మాట్లాడారు. "ప్రపంచం కృత్రిమ మేధను అక్కున చేర్చుకుంటున్న వేళ.. ఏఐ ఆధారిత ఆర్థిక వ్యవస్థకు డేటా సెంటర్లు శక్తినిస్తాయి. అయితే, ఈ డేటా సెంటర్లకు భారీ స్థాయిలో విద్యుత్ అవసరం. అది అణుశక్తి నుంచి మాత్రమే సాధ్యమవుతుంది" అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఎటువంటి కాలుష్యం లేకుండా పెద్ద మొత్తంలో విద్యుత్‌ను, స్థిరమైన బేస్ లోడ్‌ను అందించగలిగిన ఏకైక వనరు అణుశక్తి అని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. కొత్త డిజైన్లతో ఒక కంటైనర్‌లోనే అణువిద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయవచ్చని, వీటికి 14 ఎకరాల విస్తీర్ణం సరిపోతుందన్నారు. నౌకలకు వినియోగించినట్లుగానే.. 1530 మెగావాట్ల సామర్థ్యం కలిగిన అణువిద్యుత్ ప్లాంట్లను రైల్వే కార్యకలాపాలకూ ఉపయోగించవచ్చన్నారు. గ్రిడ్ ద్వారా దేశవ్యాప్తంగా 700 ప్రదేశాల నుంచి రైల్వేలు విద్యుత్‌ను తీసుకుంటున్నాయని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో చిన్న మాడ్యులర్ రియాక్టర్లు కూడా వీటికి విద్యుత్ వనరులుగా ఉపయోగించవచ్చని అన్నారు. 'శాంతి' బిల్లుకు ఆమోదం లభించినందున.. స్వచ్ఛ ఇంధనానికి అణు విద్యుత్ ప్రధాన వనరుగా మారుతుందన్నారు.

# ఇది నా భార్యకు నచ్చకపోవచ్చు..
## వర్క్‌లైఫ్ బ్యాలెన్స్‌పై జైశంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు



వర్క్‌లైఫ్ బ్యాలెన్స్.. ఈ పదం ఇటీవల బాగా వినిపిస్తోంది. జాతీయ, అంతర్జాతీయ అంశాలతో తలమునకలై, వ్యక్తిగత విషయాల గురించి అరుదుగా మాట్లాడే విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తాజాగా వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ గురించి మాట్లాడారు. అందరిలా తనకు వారాంతపు సెలవులు దొరకవని, ఈ అంశంపై తన అభిప్రాయాలు తన భార్యకు నచ్చకపోవచ్చని వ్యాఖ్యానించారు. ఈ మేరకు శుక్రవారం ఐఐటీ మద్రాస్ విద్యార్థులతో ముచ్చటించారు. "సోమవారం నుంచి శుక్రవారం వరకు షెడ్యూల్ వేసుకొని దాని ప్రకారమే నేను పనిచేయడం కుదరదు. అంతర్జాతీయ అంశాలకు ఒక నిర్దిష్ట సమయం ఉండదు. వివిధ దేశాలు వేర్వేరు టైమ్ జోన్స్‌లో ఉంటాయి. అందుకే నా జీవితంలో సెలవులు అంటూ ప్రత్యేకంగా ఏమీ ఉండవు. శుక్రవారం వరకు చేసి, శని, ఆదివారం చేయనంటే ప్రపంచం ఏమీ ఆగదుకదా..! దానర్థం నా జీవితంలో బ్యాలెన్స్ లేదని కాదు. నా దైనందిన జీవితంలో నాకంటూ కొన్ని అలవాట్లను ఏర్పరచుకున్నాను. విశ్రాంతి తీసుకోవడానికి మ్యూజిక్ వింటాను. పుస్తకాలు చదువుతాను. సినిమాలు చూస్తా. క్రీడల్లో ఏం జరుగుతుందో తెలుసుకుంటా. ప్రపంచంతో అనుసంధానమయ్యేలా నా అలవాట్లను కొనసాగించేలా చూసుకుంటాను. అదే నాకు సమతుల్యతను ఇస్తుంది. ఇక నేను ప్రత్యేకంగా బ్రేక్ తీసుకోవడం, డిటాక్స్ అవ్వాల్సిన అవసరం ఉండదు. ఈ అలవాట్ల వల్ల నా జీవితం నార్మల్‌గానే ఉంటుంది. అయితే ఇదంతా మా ఇంట్లో అందరికీ నచ్చాలని లేదు. నా భార్య ఇక్కడే ఉన్నారు. ఆమె నాతో విభేదించవచ్చు" అని జైశంకర్ చిరునవ్వులు చిందించారు.

# న్యూఇయర్ వేళ..
## నిరుపేద కుటుంబానికి భూదానం



కొలికోడ్: నూతన సంవత్సరం వేళ కానుకలు సాధారణమే. కానీ, కేరళకు చెందిన ఓ వ్యక్తి సామాజిక బాధ్యతను చాటి రోల్‌మోడల్‌గా నిలుస్తున్నారు. ఆపదలో ఉన్నవారికి వ్యక్తిగతంగా సాయం చేస్తున్న ఆయన.. తాజాగా ఓ నిరుపేద కుటుంబం ఇల్లు నిర్మించుకునేందుకు భూమిని దానంగా ఇచ్చారు. ఆయనే మెప్పలూర్‌కు చెందిన ఆంథ్రూ. ఆంథ్రూ కువైట్‌లో వ్యాపారం చేస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు. సామాజిక సేవ ఎంతో ముఖ్యమని భావించే ఆంథ్రూ కుటుంబం.. డయాలసిస్ రోగులు సహా, అనారోగ్యంతో బాధపడేవారికి సాయం చేయడం, పేదలకు ఇంటి నిర్మాణం, రిపేర్లు, పేద అమ్మాయిల వివాహాలకు ఆర్థిక సాయం వంటి కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో నారక్కోడ్‌కు చెందిన ఓ పేద కుటుంబం ఇల్లు నిర్మించుకునేందుకు నాలుగు సెంట్ల భూమిని కానుకగా ఇచ్చారు. ఆయన దాతృత్వం చేయడం ఇదేం మొదటిసారి కాదు. కుమార్తె కోరిక మేరకు.. 2022లో ఆమె వివాహం సందర్భంగా నాలుగు పేద కుటుంబాలకు 21 సెంట్ల భూమిని విరాళంగా ఇచ్చారు. ఆ స్థలంలో ఇప్పుడు ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందని, త్వరలోనే పూర్తి చేస్తామన్నారు.

# రైల్లో రూ.1.44 కోట్ల బంగారం దోపిడీలో దర్యాప్తు అధికారి పాత్ర!



గతేడాది బిహార్‌లోని ఓ రైలులో చోటుచేసుకున్న రూ.1.44 కోట్ల విలువైన బంగారం దోపిడీ కేసులో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న అధికారికి ఈ దోపిడీలో ప్రమేయం ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అతడిని అరెస్టు చేశారు. కోల్‌కతాకు చెందిన బంగారు వ్యాపారి ధనంజయ్ గతేడాది నవంబర్‌లో హౌరా బికనీర్ ఎక్స్‌ప్రెస్‌లో జైపుర్ వెళ్తున్న సమయంలో.. గయా స్టేషన్‌లో పోలీస్ యూనిఫాం ధరించిన నలుగురు వ్యక్తులు రైలు ఎక్కారు. వారిలో ఇద్దరు ఆ వ్యాపారి పక్కన కూర్చున్నారు. మాటల్లో భాగంగా అతడి వ్యాపారం, అతడి వద్ద ఉన్న బంగారానికి సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. అతడు నిద్రపోతున్న సమయంలో బంగారు బిస్కెట్లను దొంగలించారు. దోపిడీ ఘటనపై బాధితుడు పట్నా రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు సమయంలో రైల్వే అధికారుల కాల్ రికార్డింగ్స్ పరిశీలిస్తుండగా ఈ దోపిడీలో గయా జీఆర్పీ స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజేష్ కుమార్ సింగ్, ఇతర సిబ్బంది ప్రమేయం ఉన్నట్లు గుర్తించామని జీఆర్పీ సీనియర్ అధికారి వెల్లడించారు. ఈ కేసులో రాజేష్ కుమార్ సింగ్‌ను అరెస్టు చేసి, జ్యుడిషియల్ కస్టడీకి పంపామన్నారు. ఈ దోపిడీతో సంబంధమున్న ఇతర అధికారుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు.

# ఈవీఎంలకు జైకొట్టిన కర్ణాటక ప్రజలు..
## రాహుల్‌పై భాజపా సెటైర్లు



బెంగళూరు: ఎన్నికల ప్రక్రియలో విశ్వసనీయత, ఈవీఎంల పనితీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తరచూ అనుమానాలు వ్యక్తం చేస్తోన్న వేళ.. కర్ణాటకలో చేపట్టిన ఓ ప్రభుత్వ సర్వే ఫలితాలు చర్చనీయాంశంగా మారాయి. ఆ సర్వేలో రాష్ట్రంలోని మెజార్టీ ప్రజలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం)లను విశ్వసిస్తున్నట్లు తేలింది. దీంతో రాహుల్ గాంధీపై భాజపా విమర్శలు గుప్పించింది. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలపై కర్ణాటక ప్రభుత్వ ఏజెన్సీ కేఎంఈఏ (కర్ణాటక మానిటరింగ్ అండ్ ఎవల్యూషన్ అథారిటీ) గతేడాది ఆగస్టులో సర్వే నిర్వహించింది. ఆ రిపోర్ట్‌ను తాజాగా విడుదల చేసింది. దీని ప్రకారం.. ఈవీఎంలు విశ్వసించదగినవేనని 83.61శాతం మంది వెల్లడించినట్లు తేలింది. ఇక, ఈ యంత్రాలు కచ్చితమైన ఫలితాలను ఇస్తాయని 69.39 శాతం మంది అంగీకరించినట్లు నివేదిక తెలిపింది. దేశవ్యాప్తంగా ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగాయని 91.31 శాతం విశ్వసించినట్లు సర్వే పేర్కొంది. ఈ సర్వేలో 102 అసెంబ్లీ నియోజవర్గాలకు చెందిన దాదాపు 5,100 మంది పాల్గొన్నారు. బెంగళూరు, బెళగావి, కలబురగి, మైసూరు డివిజన్లలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలను సర్వే చేసి ఈ నివేదిక రూపొందించారు.

**ఇది కాంగ్రెస్‌కు చెంపపెట్టు: భాజపా**

ఈ సర్వే ఫలితాలపై కర్ణాటక ప్రతిపక్ష నేత, భాజపా నాయకుడు ఆర్.అశోక్ స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. "భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, ఈవీఎంలు నమ్మదగినవి కావని గత కొన్నేళ్లుగా రాహుల్ గాంధీ ఒకే పాట పాడుతున్నారు. మన సంస్థలను ఆయన విశ్వసించడం లేదు. కానీ, ఆయన మాట తప్పని కర్ణాటక రుజువు చేసింది. ఎన్నికలను, ఈవీఎంలను, మన ప్రజాస్వామ్య ప్రక్రియను ప్రజలు నమ్ముతున్నారు. ఈ సర్వే కాంగ్రెస్‌కు చెంపపెట్టు.

# నీరు కాదు విషాన్ని పంచారు.. ఇందౌర్‌లో మరణాలపై రాహుల్ ఆందోళన



కలుషిత నీరు తాగి మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్ నగరంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ ఘటనపై తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. అక్కడి ప్రభుత్వం నీరు కాకుండా.. విషాన్ని పంపిణీ చేస్తోందని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్టించుకోకుండా కుంభకర్ణుడిలా నిద్రపోతోందని రాహుల్ విమర్శించారు. కలుషిత నీరు తాగడం వల్ల చాలా మంది ఇళ్లలో విషాదం నెలకొందని.. పేదలు నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు. దీనికి తోడు అధికార భాజపా నేతలు నిర్లక్ష్యపు ప్రకటనలు చేయడాన్ని తప్పుబట్టారు. బాధిత కుటుంబాలకు ఓదార్పు ఇవ్వకుండా.. అహంకారంతో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. 'మురికిగా, దుర్వాసన వస్తోన్న నీటి గురించి గతంలో ప్రజలు పదే పదే ఫిర్యాదు చేసినా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదు? తాగే నీటిలో మురుగునీరు ఎలా కలిసింది? వెంటనే నీటి సరఫరా ఎందుకు ఆపలేదు? బాధ్యులైన అధికారులపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారు?' అని రాహుల్ ప్రశ్నించారు. పరిశుభ్రమైన నీరు పొందడం ప్రజల హక్కు అని అన్నారు. ఈ హక్కును కాలరాసిన భాజపా ప్రభుత్వమే దీనికి పూర్తి బాధ్యత వహించాలన్నారు. దుష్పరిపాలనకు మధ్యప్రదేశ్ కేంద్రంగా మారిందని విమర్శించారు. మొన్నటి వరకు దగ్గు మందు కారణంగా, ఆ తర్వాత ప్రభుత్వాస్పత్రుల్లో ఎలుకల వల్ల పిల్లలు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇప్పుడు కలుషిత నీరు కారణంగా మృతి చెందుతున్నారన్నారు. ఇలా ఎప్పుడు పేదలు మరణించినా.. మోదీజీ మాత్రం మౌనంగానే ఉంటారని విమర్శించారు. ఇక, ఓ మరుగుదొడ్డి వద్ద మంచినీటి పైపులైన్ లీకేజీ వల్లే ఈ మరణాలు చోటుచేసుకుంటున్నాయని నగర మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తాజాగా తెలిపారు. ఈ కలుషిత నీరు తాగి ఇప్పటివరకు 10 మంది మృతి చెందారని ఇందౌర్ మేయర్ పుష్యమిత్ర భార్గవ వెల్లడించారు.

# గ్రోక్‌లో 'ప్రమాదకర ట్రెండ్'పై మహిళా ఎంపీ ఆందోళన.. కేంద్రానికి లేఖ

ఎలాన్ మస్క్‌కు చెందిన ఏఐ చాట్‌బాట్ గ్రోక్ మరోసారి వివాదంలో చిక్కుకుంది. అసభ్య పదాలు, తిట్లతో విరుచుకుపడుతున్నట్లు గ్రోక్‌పై ఆరంభంలో విమర్శలు వచ్చాయి. రాజకీయంగానూ పక్షపాతంగా ఉందన్న ఆరోపణలూ వినిపించాయి. తాజాగా ఓ కొత్త ట్రెండ్ కారణంగా గ్రోక్ మరోసారి వార్తల్లో నిలిచింది. సాధారణ మహిళ ఫొటోను అశ్లీలంగా మార్చాలని ప్రాంప్ట్ ఇవ్వడం, దానికి గ్రోక్ సంకోచం లేకుండా సమాధానం ఇస్తుండడం వివాదాస్పదమవుతోంది. దీంతో మహిళల మార్ఫింగ్ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

# ఆల్‌టైమ్ గరిష్ఠానికి నిఫ్టీ..

## 500 పాయింట్లకు పైగా లాభపడ్డ సెన్సెక్స్



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఇవాళ భారీ లాభాలతో ముగిశాయి. ఇంటర్నేషనల్ మార్కెట్స్ నుంచి మిక్స్‌డ్ ట్రెండ్ సంకేతాలు కనిపిస్తున్నా.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ లాంటి దిగ్గజ షేర్లలో కొనుగోళ్ల మద్దతు సూచీలకు దన్నుగా నిలిచింది. ఎఫ్ఎంసీజీ మినహా మిగిలిన అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించింది.

ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 500 పాయింట్లకు పైగా లాభపడగా.. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ ఆల్‌టైమ్ గరిష్ఠాలను తాకింది. సెన్సెక్స్ ఉదయం 85,259.36 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,188.60) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 85,812.27 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 573.41 పాయింట్ల లాభంతో 85,762.01 వద్ద ముగిసింది. నిఫ్టీ ఇంట్రాడేలో 26,340 వద్ద గరిష్ఠాన్ని తాకి, చివరికి 182 పాయింట్ల లాభంతో 26,328 వద్ద స్థిరపడింది.

డాలర్‌తో రూపాయి మారకం విలువ మళ్లీ 90 మార్కు దాటి 90.20కి చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎన్టీపీసీ, ట్రెంట్, బజాజ్ ఫైనాన్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, మారుతీ సుజుకీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఐటీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ భారతీ ఎయిర్‌టెల్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నష్టాలు చవిచూశాయి. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర 60.82 డాలర్ల వద్ద కొనసాగుతుండగా, బంగారం ఔన్సు 4,387 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# బీఎస్ఎన్ఎల్ కస్టమర్లకు శుభవార్త...

## దేశవ్యాప్తంగా ఉచిత వైఫై కాలింగ్ సేవలు

## జనవరి 1 నుంచి వైఫై కాలింగ్ సేవలను ప్రారంభించిన బీఎస్ఎన్ఎల్

## ఇక ఇండోర్ ప్రాంతాల్లో, బేస్‌మెంట్‌లలో సిగ్నల్ కష్టాలకు చెక్

## ఎటువంటి అదనపు ఛార్జీలు లేకుండా ఉచితంగా వైఫై కాలింగ్ సేవలు

## ప్రత్యేక యాప్ అవసరం లేకుండానే నేరుగా ఫోన్ డయలర్ నుంచి కాల్స్

## నెట్‌వర్క్ ఆధునికీకరణలో భాగంగా బీఎస్ఎన్ఎల్ కీలక ముందడుగు




**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ తమ కస్టమర్ల కోసం కీలకమైన సేవను అందుబాటులోకి తెచ్చింది. జనవరి 1 నుంచి దేశవ్యాప్తంగా వాయిస్ ఓవర్ వైఫై (ఎనీచితిఈతి) సేవలను ప్రారంభించింది. ఈ సేవలు బీఎస్ఎన్ఎల్ కస్టమర్లందరికీ ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండానే అందుబాటులో ఉంటాయి. మొబైల్ సిగ్నల్ బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో కనెక్టివిటీ సమస్యను అధిగమించేందుకు ఈ సేవలు ఎంతగానో ఉపయోగపడతాయి.

మొబైల్ సిగ్నల్ సరిగా లేని బేస్‌మెంట్‌లు, బహుళ అంతస్తుల భవనాల లోపలి భాగాలు, మారుమూల ప్రాంతాల్లో స్పష్టమైన వాయిస్ కాల్స్ అందించడమే ఈ టెక్నాలజీ ప్రధాన లక్ష్యం. వినియోగదారులు తమకు అందుబాటులో ఉన్న బీఎస్ఎన్ఎల్ భారత్ ఫైబర్ లేదా ఇతర ఏదేని వైఫై నెట్‌వర్క్‌ను ఉపయోగించి, తమ ఫోన్‌లోని సాధారణ డయలర్ నుంచే నేరుగా కాల్స్ చేసుకోవచ్చు. దీనికోసం ప్రత్యేకంగా ఎలాంటి యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాల్సిన అవసరం లేదు.

దేశవ్యాప్తంగా నెట్‌వర్క్‌ను ఆధునికీకరించే కార్యక్రమంలో భాగంగానే ఈ వాయిస్ ఓవర్ వైఫై సేవలను తీసుకొచ్చినట్లు కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. “దేశవ్యాప్తంగా, ముఖ్యంగా సరైన సేవలు లేని గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో కనెక్టివిటీని మెరుగుపరచడంలో ఇది ఒక ముఖ్యమైన అడుగు” అని పేర్కొంది.

ఈ సేవలను పొందడానికి వాయిస్ ఓవర్ వైఫైకి సపోర్ట్ చేసే స్మార్ట్‌ఫోన్ ఉంటే సరిపోతుంది. ఫోన్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి ‘వైఫై కాలింగ్’ ఆప్షన్‌ను ఎనేబుల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ కొత్త సేవతో బీఎస్ఎన్ఎల్ కూడా జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్-ఐడియా వంటి ప్రైవేట్ టెల్కోల సరసన చేరినట్లయింది.

# పది నిమిషాల్లో డెలివరీ వెనకున్న రహస్యం ఇదీ : జొమాటో సీఈవో



**న్యూఢిల్లీ:** భద్రతా సమస్యలపై గిగ్ వర్కర్లు చేపట్టిన సమ్మెతో అల్ట్రా ఫాస్ట్ డెలివరీలపై మరోసారి చర్చ ఊపందుకుంది. కొత్త సంవత్సరం రోజున వీరి సమ్మె జొమాటో, బ్లింకిట్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో డెలివరీ సేవలపై పెద్దగా ప్రభావం చూపించనప్పటికీ.. పది నిమిషాల్లో డెలివరీ మోడల్ వల్ల రైడర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్న ప్రశ్నలు సోషల్ మీడియాలో ఆసక్తిని రేకెత్తించాయి. ఈ నేపథ్యంలో దీనిపై జొమాటో సీఈఓ దీపిందర్ గోయల్ స్పందించారు. పది నిమిషాల్లో డెలివరీ విధానంపై వివరణ ఇచ్చారు. ఈ డెలివరీ వెనుక ఉన్న అసలు రహస్యాన్ని నెటిజన్లకు అర్థమయ్యేలా వివరించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా వరుస పోస్టులు పెట్టారు.

డెలివరీ వేగం మౌలిక సదుపాయాలపై ఆధారపడి ఉంటుందని, రైడర్లపై ఒత్తిడి ద్వారా కాదని గోయల్ వివరించారు. ‘మీ ఇళ్ల చుట్టూ పెరుగుతున్న దుకాణాల వల్లే మా 10 నిమిషాల డెలివరీ సేవలు సాధ్యమవుతున్నాయి. డెలివరీ పార్ట్‌నర్స్ వేగంగా డ్రైవ్ చేయడం వల్ల ఇది సాధ్యం కాదు. అసలు డెలివరీ కోసం కస్టమర్‌కు మేం చేసిన టైమర్ ప్రామిస్ రైడర్‌కు యాప్‌లో కనిపించదు. బ్లింకిట్‌లో మాకు వచ్చిన ఆర్డర్‌ను ప్యాక్ చేయడానికి 2.5 నిమిషాల సమయం పడుతుంది. డెలివరీ సగటున 2 కిలోమీటర్ల పరిధిలోనే ఉంటుంది. గంటకు 15 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించినా 8 నిమిషాల్లో లొకేషన్‌కు రీచ్ అయిపోవచ్చు’ అని తెలిపారు.

అంతేకాదు, డెలివరీలు ఆలస్యమైతే తమ ఏజెంట్లకు ఎలాంటి జరిమానాలూ విధించమని, అలాగే సమయానికి డెలివరీ చేసినందుకు కూడా ప్రత్యేక ప్రోత్సాహకాలు ఏమీ ఉండవని స్పష్టం చేశారు. దీనివల్ల వారిపై ఎలాంటి ఒత్తిడి ఉండదని పేర్కొన్నారు. తమ సంస్థలో డెలివరీ పార్ట్‌నర్లకు భద్రత కల్పిస్తున్నామని, ప్రతి ఒక్కరికీ వైద్య, జీవిత బీమా అందిస్తున్నామని ఈ సందర్భంగా దీపిందర్ గోయల్ వెల్లడించారు. గిగ్ వర్కర్ల సమ్మె మధ్యే న్యూఇయర్ రోజు జొమాటో, బ్లింకిట్ కలిసి రికార్డు స్థాయిలో 75 లక్షల ఆర్డర్లను డెలివరీ చేసినట్లు తెలిపారు.

# బంగ్లాదేశ్ పర్యటనకు టీమిండియా..

## వన్డే, టీ20 సిరీస్ తేదీలు ఖరారు..!



**న్యూఢిల్లీ:** భారత్, బంగ్లాదేశ్ వైట్‌బాల్ సిరీస్ కొత్త తేదీలు వచ్చేశాయి. పొరుగుదేశంలో నిరుడు ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వాయిదా పడిన సిరీస్ సెప్టెంబర్ నెలలో జరుగనుంది. ఈ విషయాన్ని శుక్రవారం బంగ్లాదేశ్ బోర్డు అధికారికంగా వెల్లడించింది. గతేడాది ఆగస్టులో వాయిదా పడిన బంగ్లాదేశ్, టీమిండియా వైట్‌బాల్ సిరీస్ తేదీలను రీషెడ్యూల్ చేశాం. సెప్టెంబర్‌లో బంగ్లా పర్యటనకు భారత జట్టు రానుంది అని బీసీబీ క్రికెట్ ఆపరేషన్స్ చీఫ్ షహరీర్ నఫీజ్ తెలిపాడు.

కొత్త ఏడాదిని పురస్కరించుకొని శుక్రవారం బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు 2026లో అంతర్జాతీయ మ్యాచ్‌ల షెడ్యూల్ విడుదల చేసింది. ఈ సందర్భంగా పాకిస్థాన్, న్యూజిలాండ్, భారత్, ఆస్ట్రేలియా, వెస్టిండీస్‌తో ద్వైపాక్షిక సిరీస్ తేదీలను బీసీబీ ప్రకటించింది. కొత్త షెడ్యూల్ ప్రకారం భారత జట్టు సెప్టెంబర్‌లో బంగ్లాలో వైట్‌బాల్ సిరీస్ ఆడనుంది.

మూడు వన్డేలు, మూడు టీ20ల కోసం భారత బృందం ఆగస్టు 28న బంగ్లాకు వెళ్లనుంది. అనంతరం సెప్టెంబర్ 1న తొలి వన్డేతో సిరీస్ ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 3న రెండో వన్డే, సెప్టెంబర్ 6న మూడో మ్యాచ్‌లో ఆతిథ్య జట్టును టీమిండియా ఢీకొడుతుంది. అనంతరం సెప్టెంబర్ 9 నుంచి ఇరుజట్ల మధ్య టీ20 సిరీస్ షురూ అవుతుంది. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో సిరీస్ ముగుస్తుంది.

నిరుడు ఆగస్టులోనే టీమిండియా వైట్‌బాల్ సిరీస్ కోసం బంగ్లాదేశ్ వెళ్లాల్సింది. షెడ్యూల్ ప్రకారం.. ఆగస్టు 17 నుంచి బంగ్లాదేశ్‌లో భారత్ మూడు వన్డేలు, టీ20 సిరీస్‌లో ఆడాల్సి ఉంది. కానీ, మాజీ ప్రధాని షేక్ హసీనాకు వ్యతిరేకంగా చెలరేగిన అల్లర్లతో పర్యటనను బీసీసీఐ వాయిదా వేసింది. సాధారణ పరిస్థితులు ఏర్పడ్డాక సిరీస్‌ను నిర్వహించాలని ఇరుదేశాల బోర్డులు భావించాయి. బంగ్లాలో మహ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడడం.. ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో అక్కడ సాధారణ పరిస్థితులు ఏర్పడే అవకాశముంది. అందుకనే కొత్త ఏడాది రెండో రోజునే బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు వైట్‌బాల్ సిరీస్ తేదీలను ప్రకటించింది.

# ఇంగ్లండ్ స్క్వాడ్‌లో స్పిన్ సంచలనం..





## యువ పేసర్‌కు పిలుపు..!

**లండన్:** యాషెస్ సిరీస్‌లో ఎట్టకేలకు బోణీ కొట్టిన ఇంగ్లండ్ విజయంతో సిరీస్‌ను ముగించాలనుకుంటోంది. బాక్సింగ్ డే టెస్టులో ఆస్ట్రేలియాకు షాకిచ్చిన బెన్ స్టోక్స్ సేన.. సిడ్నీలోనూ దూకుడే మంత్రగా ఆడనుంది. జనవరి 4న సిడ్నీలో జరుగనున్న చివరి టెస్టు కోసం ఇంగ్లండ్ కీలక మార్పులు చేసింది. ఆ దేశ క్రికెట్ బోర్డు శుక్రవారం 12 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించింది. కొత్త ఏడాదిని విజయంతో ఆరంభించాలనుకుంటున్న బౌలింగ్ యూనిట్‌ను పటిష్టం చేసుకుంటూ యువ స్పిన్నర్ షోయబ్ బషీర్, మాథ్యూ పాట్స్‌లకు చోటు కల్పించింది.

పెర్త్, బ్రిస్బేన్, అడిలైడ్‌లో ఓటమితో యాషెస్ సిరీస్ సమర్పించుకున్న ఇంగ్లండ్ మెల్‌బోర్న్‌లో పంజా విసిరింది. కుర్ర పేసర్ జోష్ టంగ్ విజృంభణతో ఆతిథ్య జట్టును మట్టికరిపించిన బెన్ స్టోక్స్ బృందం.. సిడ్నీ టెస్టుకు పక్కాగా సిద్ధమవుతోంది. అయితే.. తొడకండరాల గాయంతో బాధపడుతున్న పేసర్ గస్ అట్కిన్సన్ ఐదో టెస్టుకు దూరమయ్యాడు. అతడి స్థానంలో మాథ్యూ పాట్స్ ఎంపికయ్యాడు. మెల్‌బోర్న్ ఓటమి నుంచి తేరుకొని విజయ గర్జన చేయాలనుకుంటున్న ఆసీస్ స్టీవ్ స్మిత్ సారథిగా బరిలోకి దిగనుంది. అయితే.. నాలుగో టెస్టు స్క్వాడ్‌లో ఆ దేశ బోర్డు ఏ మార్పులు చేయలేదు.

ఇంగ్లండ్ తుది జట్టు : జాక్ క్రాలే, బెన్ డకెట్, బెన్ స్టోక్స్(కెప్టెన్), జో రూట్, జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, జేమీ స్మిత్(వికెట్ కీపర్), షోయబ్ బషీర్,బ్రైడన్ కార్సే, విల్ జాక్స్, మాథ్యూ పాట్స్, జోష్ టంగ్.

# డ్రాగన్ వేషంలో యూనివర్సల్ బాస్..

## కొత్త ఏడాదికి స్వాగతం అదిరింది..!



**న్యూఢిల్లీ:** వెస్టిండీస్ మాజీ ఓపెనర్ క్రిస్ గేల్ ఒకప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌లో ఓ సంచలనం. అతడు క్రీజులోకి వచ్చాడంటే బౌలర్లు వణికిపోయేవాళ్లు. దంచడమే డ్యూటీగా భావించే ఈ డాషింగ్ బ్యాటర్ నెలకొల్పిన రికార్డులు కోకొల్లలు. క్రికెటర్‌గా తన విధ్వంసక ఆటతో అభిమానులను అలరించిన గేల్.. ఈమధ్య తన ప్రత్యేక వేషధారణతో వైరలవుతున్నాడు. కొత్త సంవత్సరం సందర్భంగా ఈ కరీబియన్ వీరుడు డ్రాగన్ వేషంలో.. కార్నివాల్ డాన్స్ వీడియోతో మరోసారి నెట్టింటిని షేక్ చేస్తున్నాడు.

ఆల్‌టైమ్ దిగ్గజ ఓపెనర్లలో ఒకడైన క్రిస్ గేల్ కొత్త ఏడాది సందర్భంగా తమ ప్రాంత విశిష్టతను ప్రపంచానికి చాటాడు. డ్రాగన్ వేషధారణతో హుషారుగా డాన్స్ చేస్తూ మురిసిపోయాడీ యూనివర్సల్ బాస్. ఇన్‌స్టాగ్రామ్‌లో ‘ఫుక్రి గ్యాన్ 2026’ పేరుతో షేర్ చేసిన వీడియోలో కరీబియన్ మూలాలతో గిల్ కనిపించాడు. ఈ పదానికి ‘ఏం జరుగుతోంది?’ అని అర్థం. పక్షి రెక్కలను పోలిన డ్రాగన్ బొమ్మలను ధరించిన గిల్.. చేతిలో పొడవాటి కర్రతో చిందులు వేశాడు. మైదానంలో తన డేరింగ్ ఆటకు కేరాఫ్ అయిన ఈ మాజీ ఓపెనర్.. ఇప్పుడు సంప్రదాయ లుక్‌లో దర్శనమిచ్చి ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పించాడు.

వరల్డ్‌కప్ హీరో..

జమైకాకు చెందిన గేల్ 1999లో క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. విధ్వంసక ఇన్నింగ్స్‌లతో అనతికాలంలోనే డేంజరస్ బ్యాటర్‌గా గుర్తింపు పొందాడు. టెస్టులు, వన్డేలు, టీ20లు.. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా పరుగుల వరద పారించాడు. విండీస్ జట్టు 2004లో చాంపియన్స్ ట్రోఫీ, 2012, 2016లో టీ20 వరల్డ్ కప్ చాంపియన్‌గా నిలవడంలో గేల్ కీలక పాత్ర పోషించాడు. మొత్తంగా కెరీర్‌లో 19,593 రన్స్ కొట్టిన ఈ కరీబియన్ వీరుడి ఖాతాలో 147 హాఫ్ సెంచరీలు, 42 సెంచరీలు ఉన్నాయి.

# విధ్వంసక హిట్టర్‌కు షాకిచ్చిన సెలెక్టర్లు..

## 19 ఏళ్ల కుర్రాడికి ప్రపంచకప్ బెర్త్..!

**న్యూఢిల్లీ:** రెండేళ్ల క్రితం టీ20 ప్రపంచకప్ ఫైనల్లో తడబడిన దక్షిణాఫ్రికా ఈసారి టైటిల్ లక్ష్యంగా కదులుతోంది. ఈ మెగాటోర్నీకి సమయం సమీపిస్తున్నందున శుక్రవారం సెలెక్టర్లు స్క్వాడ్‌ను ప్రకటించారు. ఎడెన్ మర్క్‌రమ్ కెప్టెన్‌గా 15 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేశారు. అనూహ్యంగా యువ హిట్టర్ ట్రిస్టన్ స్టబ్స్‌ను పక్కన పెట్టేశారు. ఇటీవల వికెట్ల వేటతో అదరగొడుతున్న 19 ఏళ్ల పేసర్ క్వెనా మఫాకాను మెగా ఈవెంట్‌కు ఎంపిక చేశారు.

ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ కోసం సీనియర్లు, జూనియర్లతో కూడిన దుర్భేధ్యమైన బృందాన్ని సఫారీ సెలెక్టర్లు ఎంపిక చేశారు. గాయం కారణంగా భారత పర్యటనలో ఆడని పేసర్ కగిసో రబడను స్క్వాడ్‌లోకి తీసుకున్నారు. దేశవాళీ టీ20 లీగ్, ఎస్ఏ20లో మెరిసిన జేసన్ స్మిత్, అండర్ -19 ప్రపంచకప్‌లో మెరిసిన యువ పేసర్ క్వెనా మఫాకాకు తొలిసారి వరల్డ్‌కప్ బెర్తు లభించింది.

అయితే.. ఐపీఎల్‌లో విధ్వంసక హిట్టర్‌గా అవతరించిన స్టబ్స్‌కు, భారత్‌పై వన్డే సిరీస్‌లో దంచేసిన రీజా హెండ్రిక్స్‌కు మాత్రం స్క్వాడ్‌లో చోటు దక్కలేదు. ఫిబ్రవరి 7న భారత్, శ్రీలంక వేదికగా ప్రారంభం కానుంది. ఇటీవలే టీమిండియా చేతిలో వైట్‌బాల్ సిరీస్ కోల్పోయిన సఫారీ టీమ్ ఈసారి వరల్డ్ కప్ లక్ష్యంగా రానుంది.

దక్షిణాఫ్రికా స్క్వాడ్ : ఎడెన్ మర్క్‌రమ్(కెప్టెన్), క్వింటన్ డికాక్, డెవాల్డ్ బ్రెవిస్, డేవిడ్ మిల్లర్, డొనొవాన్ ఫెరీరా, టోనీ డి జోర్జి, జార్జ్ లిండే, మార్కో యాన్సెన్, కార్బిన్ బాష్, లుంగి



ఎంగిడి, కగిసో రబడ, కేశవ్ మహరాజ్, అన్రిజ్ నోర్జి, క్వెనా మఫాకా, జేసన్ స్మిత్.

‘పొట్టి వరల్డ్ కప్ స్క్వాడ్ ఎంపికకు కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చింది. ఈ గ్రూప్ భారత్, శ్రీలంకలో విజయవంతమవుతుందని నమ్మకముంది. అనుభవజ్ఞులు, ప్రతిభావంతులతో కూడిన ప్రపంచస్థాయి, అత్యుత్తమైన స్క్వాడ్‌ను ఎంపిక చేశాం’ అని కన్వీనర్ సెలెక్టర్ పాట్రిక్ మొరానే తెలిపాడు.

# విశ్వక్ సేన్ కొత్త మూవీ లెగసీ

**టాకీస్:** టాలీవుడ్ యంగ్ అండ్ డైనమిక్ హీరో, మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మరో విలక్షణమైన కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'లెగసీ'. ప్యూర్ పొలిటికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. పాలిటిక్స్ ఈజ్ పర్సనల్ అనే




పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. టీజర్ ప్రారంభం నుండి ముగింపు వరకు చాలా ఇంటెన్స్‌గా సాగింది. ముఖ్యంగా విశ్వక్ సేన్ చెప్పిన డైలాగులు పొలిటికల్ హీట్‌ను పెంచుతున్నాయి: రాజకీయమంటే పులిమీద సవారీ లాంటిదంటారు.. ఆ పులి మీద నాయకుడు ఒక్కడే కూర్చోవాలా? ఆ కుటుంబం మొత్తం కూర్చోవాలా?దిస్ ఈజ్ యాన్ ఇంటర్నల్ వార్ ఫర్ రియల్ లెగసీ ఈ డైలాగ్స్ చూస్తుంటే, అధికారం కోసం ఒకే కుటుంబంలో జరిగే అంతర్గత పోరు, వారసత్వ రాజకీయాల చుట్టూ ఈ కథ తిరుగుతుందని స్పష్టమవుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా విశ్వక్ సేన్ ఈ సినిమాలో ఒక సీరియస్ పొలిటీషియన్ పాత్రలో కనిపిస్తుండటం విశేషం. ఈ చిత్రానికి సాయికిరణ్ రెడ్డి దైడా దర్శకత్వం వహిస్తున్నారు. భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ సినిమాలో ఏక్తా రాథోడ్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. రావు రమేశ్, సచిన్ ఖేడ్కర్, మురళీ మోహన్, కేకే మేనన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## ప్యారడైజ్ నుంచి జడల్ జమానా లుక్ విడుదల




**టాకీస్:** 'దసరా' విజయం తర్వాత కథానాయకుడు నాని.. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో రూపొందుతున్న బహుభాషా చిత్రం 'ది ప్యారడైజ్'. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. మోహన్‌బాబు ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా నుంచి కొత్త ఏడాది సందర్భంగా ఓ కొత్త లుక్‌ను విడుదల చేశారు. 'జడల్ జమానా' అంటూ వచ్చిన ఆ ప్రచార చిత్రంలో నాని యాక్షన్ లుక్‌లో ఆకట్టుకునేలా కనిపించారు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ సినిమా మార్చి 26న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

## ది కేరళ స్టోరీ-2కు ప్లాన్

**టాకీస్:** ఎన్నో వివాదాలు, విమర్శల మధ్య విడుదలై బాక్సాఫీసు వద్ద మంచి వసూళ్లను సొంతం చేసుకుంది 'ది కేరళ స్టోరీ' చిత్రం. అదా శర్మ కథానాయికగా నటించింది. కేరళలో కొన్నేళ్లుగా మహిళలు అదృశ్య




మైనట్లు వస్తోన్న ఆరోపణలకు సంబంధించి వారి ఆచూకీ ఎక్కడనే ఇతివృత్తంతో సుదీప్తో సేన్ దీన్ని తెరకెక్కించారు. పలు పురస్కారాలను సొంతం చేసుకున్న ఈ చిత్రానికి ఇప్పుడు సీక్వెల్‌గా 'ది కేరళ స్టోరీ 2' రాబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే చిత్రీకరణ కూడా పూర్తయినట్లు సమాచారం. ఈ సీక్వెల్ మరింత భయంకరమైన చీకటి కథను ప్రదర్శిస్తుంది. నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా చిత్రీకరణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కఠినమైన భద్రతను పాటించారు. ఈ కొనసాగింపు చిత్రాన్ని ఫిబ్రవరి 27న థియేటర్లలోకి తీసుకురావాలని విడుదల తేదీని కూడా ఖరారు చేశారు. త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.



## టైగర్ ష్రాఫ్‌తో జతకట్టనున్న కృతిశెట్టి

టాకీస్: అందాల తార కృతి శెట్టి.. బాలీవుడ్‌లోకి అడుగుపెట్టనుందా? అంటే అవుననే అంటున్నాయి సినీ వర్గాలు. హిందీ యాక్షన్ హీరో టైగర్ ష్రాఫ్‌తో దర్శకుడు మిలాప్ జవేరి ఓ చిత్రం కోసం చేతులు కలిపినట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఇందులో కథానాయికగా కృతి శెట్టిని ఎంపిక చేసిందట చిత్రబృందం. 'ప్రముఖ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ దీన్ని భారీ బ్జడెట్‌తో రూపొందించాలని నిర్ణయించుకుంది. జనవరిలో ముంబయిలో చిత్రీకరణ ప్రారంభం కానున్న ఈ సినిమాలో టైగర్ సరసన నటించడానికి కృతి ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఇదే ఆమెకు తొలి హిందీ చిత్రం కావడం విశేషం. యాక్షన్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయ'ని కృతి సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ', 'వా వాతియార్' విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

## మన శంకర వరప్రసాద్ ట్రైలర్ 4న విడుదల




**టాకీస్:** మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మన శంకర వరప్రసాద్ గారు' ట్రైలర్ అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమా ట్రైలర్‌ను జనవరి 4న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. సంక్రాంతికి వస్తున్నాం వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. మెగాస్టార్ చిరంజీవి, నయనతార ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించబోతు న్నాడు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

## సంయుక్త మీనన్.. ది బ్లాక్ గోల్డ్



**టాకీస్:** ది బ్లాక్ గోల్డ్' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించనుంది సంయుక్తా మేనన్. ఇది ఆమె చేస్తున్న తొలి నాయికా ప్రాధాన్య చిత్రం. యోగేశ్ కేఎంసీ తెరకెక్కిస్తున్నారు. రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. మురళీ శర్మ, రావు రమేశ్, నాజర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఈ వేసవిలో తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ విషయాన్ని కొత్త ఏడాది సందర్భంగా గురువారం ప్రకటించారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. 'ఊహించని మలుపులతో సాగే సరికొత్త కథతో.. అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలతో ఈ సినిమా అందర్నీ అలరించేలా ఉ ఒడనుంది. సంయుక్త దీంట్లో శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే 75శాతం చిత్రీకరణ పూర్తయింది. మరో 15రోజుల చిత్రీకరణెలి మిగిలి ఉంది. నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: సామ్ సీఎస్, ఛాయాగ్రహణం: ఎ వసంత్.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.